నవలిక :

# సంగమం

అరుణ

**నాకు నా స్నేహితులు చాదస్తుడ్ననే మారు పేరు ఎప్పుడో పెట్టేశారు.**

**నా జీవితం మీద వారి అభిప్రాయం ఏలావున్నా, నా అనుభవం నా స్వంత స్థిరాస్థి. దాన్ని వేరే కోణంలోంచి చూడటం నాకు చేతకాదు. ఈ జీవితంలో ఆనందం లేదుగాని, తృప్తి వుంది. భగవంతుని కళామయ ప్రపంచంలో నాది అర్థంలేని రంగయితే కావచ్చు, కాని అది ఒక రంగు. ఆ రంగు వుండటంవలననే ఆ చిత్రానికి అందం పరిపూర్ణత వస్తుందని తృప్తి.**

రాధ ఉత్తరం వ్రాసింది.

ఎప్పుడు వ్రాస్తూనే వుంటుంది. యుగయుగాలుగా నాకోసరం, నా హృదయపు కవాటాలవద్ద అంతులేని నిరీక్షణతో రాధ.- రాధ అనిర్వచనీయమైన అనుభవానికి సరిహద్దు.

ఝరీ వేగంతో ప్రవహించే జీవితవాహినికి రాధ ఒక విశ్రాంతి స్థావరం.

రాధని తలుచుకుంటే అలాంటి అనుభూతే కలుగుతుంది ఎప్పుడూ! ఈ ప్రకంపన ఎన్ని యుగాలనుంచి వెంటాడుతున్నదో నాకే తెలియదు.

రాధమీద నాకు గౌరవం ఉంది. ప్రేమ ఉంది. అభిమానం ఉంది.

కాని రాధ నాకు అక్కర్లేదు. అయినా రాధకి నేనంటే అంత ఇష్టం. నిండు మనస్సు,పండువెన్నెలలాంటి హృదయం, పున్నమి చంద్రునివంటి ఆత్మ నా కోసరం సంతోషంగా సమర్పిస్తుంది. నా భావన అది కాదు. ఆమె అతి పవిత్రమైన స్త్రీ. సమస్త సృష్టి రహస్యాలు తనలో దాచుకున్న ప్రకృతి. ఆమెలో శక్తి ఉన్నది. ఆమెను చూస్తే ఎంత రసానందము కలుగుతుందో అంత భయం కలుగుతుంది. అందుకే నాకు రాధమీద ప్రేమలో కోరిక లేదు. ఆస్వాదించాలని ఆకాంక్షలేదు. రాధ ఎవరికోసరము కాదు. రాధకోసరం రాధ. అంతే!

ఈ పవిత్ర జాగృతికి ఆది ఎప్పుడో తెలియదు. చాల రోజులు కలిసి చదువుకున్నాము. ఎన్నో గంటలు బీచిలో పక్కపక్కన కూర్చొని కబుర్లు చెప్పుకున్నాము. మా ఇద్దరి మధ్య పేరుకున్న ఆ ఇసుక కుప్ప ఇప్పటికీ అలాగే వుంది. అలాగే వుండాలని నా కోరిక. కాని రాధఅలాకాదు. తను పొంగిపొరలే ఉప్పెన. కడలినిచేరాలని చూస్తుంది.

రాధ ఉత్తరం వ్రాస్తుంది—

—ఈ పాటికి ప్రక్కమీదనుండి లేవగా చూశావా ఎప్పుడైనా? ఈ రోజు ప్రొద్దుటే ఒక విచిత్రం జరిగింది. ఎవరో తలుపు తట్టారు. ఎందుకో నువ్వేననిపించింది. చప్పున లేచి వెళ్ళి తలుపు తీశాను. తీరా చూస్తే పాలవాడు! ఇలా ఉంది నా అన్వేషణ.

రోజూ, ఉదయం నుంచి సాయంకాలం దాకా ఒకే నిరీక్షణ.

నీ కోసరం, నీ చిరునవ్వు కోసరం.

ఎందుకు నీ మీద నాకింత ప్రేమ అని ఎన్నోసార్లు ప్రశ్నించుకున్నాను.

జవాబు లేదు, రాదు.

నీ ప్రేమతాలూకు స్మృతిలో నన్ను జీవింపచేయగల శక్తి లేదు. నీ జీవితంనాకు ఊహే అయినా అది సత్యం. నీవనే మాట గుర్తుంది. కలలు, ఆశలు వట్టివి కాబట్టే కల్పనలో అంత మాధుర్యం వుంది అని.

ఇక నిద్రపట్టక కిటికీ తెరిచి చూస్తూ కూర్చున్నాను. ఏ మహా ప్రేమకో తూర్పు ధిక్కు వసంతం చిలకరించి నవ్వుతోంది. క్రింద చెరువులో పద్మాలు విచ్చుకున్నాయి. చెరువులో నీళ్ళు కిలకిల నవ్వుతూ ఒడ్డును తాకుతున్నాయి. నే నక్కడే నిలబడి వున్నాను. అంతలో నా చుట్టూ ప్రకృతిలో ఎంత మార్పు? నీ సత్యానికి శివానికి సుందరానికి నేనెంత దగ్గరగా వున్నానో నీకే తెలియదు. నీ వ్యతిరేకతలో నేనిలా జీవించ గలగడం దురదృష్టం. అది నా శాపం.

నిన్ను మరచిపోవాలని శాయశక్తులా ప్రయత్నించాను.

ఉహూః ఓడిపోయాను.

అయినా నా పిచ్చిగాని నిన్ను మరిచి పోవటం నాకు సాధ్యమా?

ముసురు కుంటున్న నీ స్మృతులతో ఈ ఒంటరితనంతో - ఎన్నాళ్ళిలా జీవితం? అంతులేని నిరీక్షణ? ఏ రాత్రి కారాత్రి ఇది చివరి రాత్రి అయితే ఎంత బాగుండు అనిపిస్తుంది. ఎందుకో నా జీవితంలోని మారుమూలల్లోంచి మరణం తొంగి చూస్తున్నదేమో ననిపిస్తుంది. బాధ నా జీవితంలో ఒక భాగమై పోయింది. కాల బిందువుల చివరి అంచున నిలబడి నిన్ను పిలుస్తున్నాను.

ఈ పూలు ఉదయాన్నే విచ్చుతాయి. రాత్రి నా ఆవేదనంతా పంచుకున్నట్లు అశ్రుపుష్పాల్లాంటి మంచుబిందువులతో మెరుస్తాయి. నీ తలపు అగ్నికణాల్లాంటి పెదవులతో నా ఆత్మని చుంబిస్తుంది. చుట్టూ కలలు పేర్చిన రాత్రి భారంగా గతంలో దీర్ఘ నిద్ర పోతుంది.

ఇది వేదన. దీని ఆద్యంతాలు నేను చెప్పలేను. ఎంత ప్రయత్నించినా జీవితానికి వ్యాఖ్యానం దొరకటంలేదు. ఒక స్త్రీ జీవితం ఇలా నీ చుట్టూ ఉపగ్రహంలా తిరుగుతున్నదని నీకు గర్వం కాబోలు! కాని అందులో ఆకర్షణ లేదు.

నాజీవితానికిఅర్థములేదు-పరమార్థంలేధు అర్థంకల్పించగలవ్యక్తివి నువ్వే. "జీవితం ఊహించటం ఒక ఎత్తు. అనుభవించటం ఒక ఎత్తు."

నాన్నని చూస్తే జాలివేస్తుంది. నన్ను చూసి ఏదోవెలితితో బాధపడతాడు. ఆబాధను వ్యక్తం చేయలేడు. ఈ ఇంట్లో ఎవరికి వారు ప్రత్యేక వ్యక్తులు. విచిత్రంగా లేదూ? ఇద్దరికీ ఎదుటపడటానికి భయమే. జీవితాలలో దాచుకొన్న రహస్యాలు బయటపడుతాయి.

ఎన్ని కన్నీళ్ళు రాలినా పగిలిన హృదయం అతకదు. రక్తం కారుతున్న హృదయం ఆగిపోవటానికి సిద్ధంగా వుంది. ఆగిపోయే లోపల నిన్ను చూడాలని వుంది. వస్తానని మాట ఇవ్వు. అంతేచాలు ఈ జన్మకి.

నువ్వూ - నేనూ ప్రేమకి నిర్వచనం దొరకటం కోసరం వున్నామేమో? కాని ఈ ప్రేమ నన్ను దహిస్తున్నది. కాని నా ప్రేమ సర్పరజ్జుభ్రాంతి కాదని నా నమ్మకం. దాన్ని నా మరణంతోనైనా రుజువుచేసుకుంటాను.

—రాధ."

రాధ కన్నీటి చుక్కలా ఉత్తరం. ఇలా ఎన్ని రాలినయి?

రాధని ప్రేమించకపోవటం పాపం. రాధని ప్రేమించని క్రూరుడు నేను తప్ప ఎవరు వుండరు. యుగయుగాల ఘోర తపస్సులోనాకోసరం ఎదురుచూసే రాధ.నా జీవితం తన వరమనుకునే రాధ. అలాంటి రాధ- నా పాదాల రవాల కోసరం వేయి హృదయ శ్రవణాలతో ఎదురుచూసే రాధ. వ్యక్తం చేయలేని అనుభూతిరాధ- అలాంటి రాధని నేను ప్రేమించలేకపోతున్నాను. నా ఆత్మలో మౌన మహాముద్రయి దాక్కున్న రాధని ప్రేమించలేకపోతున్నాను. ఏమిటీ లోపం?

రాధ అనేది—

"బ్రతుకులేమొ భస్మమైనా
ప్రణయమైనా బ్రతికి వుంటే
స్వర్గముంటే మరుగు నెదలకు
శాంతి సుఖములు రాకపోవు"

నా చెవుల్లో మార్మోగుతూనే వుంది.

* * *

అలా ఎంతసేపు కూర్చున్నానో నాకే తెలియదు.

"రాధ ఉత్తరం నన్ను మరో ప్రపంచానికి తీసుకుపోయింది. వసుంధర వచ్చి పిలిచేదాకా నాకు బాహ్య ప్రపంచం తెలీదు.

"ఏం వసుంధరా?" అన్నాను వసుంధర పిలుపుకి.

"ఆ పేషంటు మిమ్మల్ని రమ్మంటున్నారు." ఈ మధ్య మా నర్సింగ్‌హోంకి ఒక విచిత్రమైన పేషంటు వచ్చాడు. ఆయన జీవితంలో బాగా ఓడిపోయాడు. ఆ ఓటమిని మరిచిపోవటానికి తాగేవాడు. ఇంకా ఓడిపోయాడు. ఆయనకు ఒక్క భార్య తప్ప ఎవరూ లేరు. యాభై సంవత్సరాల వయస్సులో ఇరవై సంవత్సరాల పిల్లని చేసికుని ఆమె జీవితం ధ్వంసం చేశాడు. ఇప్పుడు కాస్త కుదుటపడ్డాడు. కాని ఆ గతకాలపు భగ్నావశేషాలమీద నుంచి మరలటం లేదు ఆయన మనస్సు. ఆయనకి గతాన్ని గురించిన తలపువస్తే బాధ. దాన్నెవరితోనయినా చెప్పుకోవాలి. అది ఆయన స్వభావం. దానికి నేనే దొరికాను.ఆ విషాద గాథ ఎన్నోసార్లు విన్నాను. ఆయన అనుభవంతో నన్ను సానుభూతి చూపమంటాడు. అయనమీద జాలి వుంది. ఆయన ఎక్కువకాలం బ్రతకడు. దాదాపు చిట్టచివరి మెట్టు ఎక్కుతున్నాడు. జీవితంలో అత్యున్నతమైన బహుమానాన్ని అందుకోబోతున్నాడు. వసుంధర ఇంకా అక్కడే నిలబడి వుంది.

"సరే వస్తాను."

వసుంధర వెళ్ళిపోయింది.

వెళ్ళాలి. వెళ్ళకపోతే కబుర్లమీద కబుర్లు చేస్తాడు. నాకు మిగిల్చే ఆ విషాద కథ మరోసారి వినక తప్పదు.

అప్పుడే రాత్రి అయింది. రాత్రి అతిధిలా చీకటి ప్రవేశించి, వెలుగును దురాక్రమణ చేసింది. దాదాపు రోగులందరు పడుకున్నారు. ఎక్కడో అంతర్వాణి హెచ్చరికల్లా మాటలు వినబడుతున్నాయి.

"ఇంకా పడుకోలేదా ?" అన్నాను గదిలో ప్రవేశిస్తూ.

అతని భార్య కాబోలు పమిటి లాక్కుని ప్రక్కకి తప్పుకుంది. రోజు అంతే, ముఖమైనా కనపడనివ్వదు.

"కూర్చోవయ్యా డాక్టరు,కూర్చో. పాపాయిలు పడుకున్నారా?"

పాపాయిలంటే రోగులు. రోజు ఇలాగే మాట్లాడుతాడు హాస్యంగా. అందుకే నాకు మరీ జాలివేస్తుంది ఆయన్నిచూస్తే. ఎన్నాళ్ళింకా ఇలా మాట్లాడగలడు.

"పడుకున్నారా! మీరు పడుకోండి."

ఆయన ముఖంలో చిరునవ్వు వెలిగింది వాడిపోయిన పువ్వులాగా.

"పడుకునేవాడిని నిన్నెందుకు పిలుస్తాను? నా సంగతి అలా వుంచు. నాదేముంది 'పులుసులో ముక్కని'. సరేకాని డాక్టరు, తీరికేనా? ఏ పేషంటైనా గొడవ చేస్తున్నాడా!"

"ఏం?"

"విను. చివరిమాట, చిట్టచివరి మాట. ఇక చెప్పను. ఇది నా సంగతి కాదు. మా ఆవిడ్నిచూస్తే నీ కేమనిపిస్తున్నది?"

చాల చిక్కు ప్రశ్న.

నేను మాట్లాడలేదు.

"లేదోయ్, వేరే ఉద్దేశ్యంతో అడుగలేదు. పోనీ, నా మీద కోపం రావటం లేదూ?" అన్నాడు.

"ఎందుకు?"

"ఎందుకేమిటోయ్? భలేవాడివే, నువ్వు డాక్టరువే గాని నీకు హృదయపు లోతులు అందవు. అది సరేగాని. మొన్ననేగా నా హృదయం ఎక్స్‌రే తీయించావు.చూశావా"

"చూశాను."

"ఎలా వుంది."

"బాగుంది."

"దానినిండా గాయాలు లేవూ? దాని పగుళ్ళ లోంచి రక్తం.కన్నీరులా కారటం లేదు? ఏ కన్నీరు, ఏ భవిష్యత్తు దాన్ని అతికించగలదు? ఏ నిండు మనస్సు దానికి నవనీతం పూయగలదు? లాభంలేదు డాక్టరు నేను మళ్ళీ ఓడిపోయాను. అదే నాబాధ—"

ఆయన చిన్న పిల్లాడిలా కన్నీరు నింపుకున్నాడు.

"బాధ నిద్రని మరపిస్తుంది. నిద్ర బాధని పోగొడుతుంది. ఇలా మీచుట్టూ కాళరాత్రిని సృష్టించుకుంటానంటే నేను వెళ్ళిపోతాను"


"కాసేపు ఉండవోయ్ బాబు, కాస్త నా కథ విను.

ఆయనకు దగ్గు వచ్చింది. ఆ బాధ పగవాడికి కూడా వద్దు.

నేను ఆయన వంక చూడలేకపోయాను.

"పడుకోండి. రేపు వస్తాను."

"కాదు-డాక్టరూ-"



ఆయన ఆయాసంతో రొప్పుతూ నా చేయి పట్టుకుని ఆపాడు.

కొంచెం ఆయాసం తగ్గాక, "చీకటికి వెలుగుకి ఉన్నంత దూరముంది నాకు-రేపుకి. అంతవరకు ఉంటానో ఉండనో? నువ్వు చెప్పకపోయినా నాకు తెలుసు డాక్టర్ నా పరిస్థితి. నా కెందుకో ఇదే చివరి క్షణమనిపిస్తున్నది. ఈ చీకటి రాత్రి నా ఆత్మని నా నుంచి వేరు చేస్తుంది. ఇలాంటి బ్రతుకు నాది- నేను ఓ నిండు స్త్రీ జీవితం,నాశనం చేశాను. పువ్వులా నలిపేశాను."

ఆయన ముఖం మరింత మలినమైంది. ఉన్నట్లుండి ఆయన స్థితి మారిపోయింది. ఆయన హృదయంలో నిద్రపోతున్న మరణం ఒళ్ళు విరుచుకుని లేచి కూర్చుంది. నేను మాట్లాడలేని స్థితిలో వున్నాను. నా నోరు మూగబోయింది.

"సుమని చూశావా?"

"లేదు."

"నాకు చేయవలసిన ఉపకారమిదే బాబు. నిన్ను మరోమారు ఋణగ్రస్తుడ్ని చేసుకుంటున్నాను. మా సుమని కాస్త కనిపెట్టి వుండు. ఏం సరేనా?"

అన్నాడు నా రెండు చేతులూ పట్టుకొని.

"నేనా?" అన్నాను.

"నువ్వే. నీకంటే ఆప్తులులేరు. నీమీద నాకు నమ్మకముంది. సుమని ఏ పరిస్థితులలో వివాహం చేసుకున్నానో భగవంతుడికి తెలుసు. నా కింతకన్నా ప్రాయశ్చిత్తం లేదు. అది ఒప్పుకుంటే దానికనచ్చిన వ్యక్తినిచ్చి వివాహంచేయి. నా ఆత్మ అప్పుడే శాంతి పడుతుంది."

ఆవేశంతో రొప్పుతు చెప్పాడు.

చప్పున కుర్చీలోంచిలేచి "కరుణాకరం గారు" అన్నాను వారిద్దామని.

"ఇదే నా ఆఖరి కోరిక" అన్నాడు గద్గద స్వరంతో.

ఆయనముఖం కన్నీటితోతడిసిపోయింది. నా మనస్సులో ఎన్నో ప్రశ్నలు ఉదయించినయి. అన్నీ శేష ప్రశ్నలే. ఊపిరి సలపని వేదన. ఆయన ముఖం చూడలేక కిటికీ దగ్గరకు వెళ్ళి నిల్చున్నాను.

త్రాగిన వాడిలా తూలుతున్నది రాత్రి. కొండల మీదనుంచి ఒంటరి ప్రయాణీకుడిలా దిగంతాలకు పోతున్నది చీకటి. ఎంతో అసంతృప్తితో ముగియబోతున్న

ఆయన జీవితాన్ని తలుచుకుంటే జాలి వేస్తుంది.

"సు—మా?"

ఏదో స్పర్శ. నాకు అర్థం కాని అనుభూతి. చప్పున వెనక్కి తిరిగాను.

"డా—క్ట—రూ—"

ఒక వేదనా భరితమైన కేక ఇద్దరిని ఒక చోటుకి చేర్చింది.

ఆయన మంచానికి చెరోవేపు నేను, ఆమె నిల్చున్నాము. ఆయన మంచంమీదే మృత్యువు కూర్చున్నది.

"ఈమే నాకు ఇంతవరకు భార్యగా వున్న సుమ. కేవలం నామ మాత్రానికే. కదూ సుమా?" ఆయన నవ్వాడు.

ఆ నవ్వులోంచి చైతన్యం క్రమంగా విలుప్తమైపోతున్నది.

సుమ కన్నీటితో తలెత్తి చూసింది.

నిర్ఘాంతపోయాను.

వర్షంలో తడిసిన పువ్వులా ఉంది సుమ.

సుమ.

కాదు. శాంతి!

"శాంతి"

నా కళ్ళు ఆత్రంగా ఆమెవంకచూశాయి.

నేను పోగొట్టుకున్న వస్తువు ఇదేనా?

మళ్ళీ దీన్ని నేను పొందగలనా? ఎక్కడెక్కడో తిరిగి నా కోసరమే ఇక్కడికి వచ్చిందా?

"శాంతి, నువ్వు వెళ్ళిపోయావనుకున్నాను. నీ మూర్తిని నా దగ్గర నుంచి ఉపసంహరించ లేదు. నా కోసరం నీ ప్రేమ సజీవాకృతి దాల్చి వచ్చింది."

"డాక్టరు- ఏది నీ చెయ్యి-"

ఒక్క-క్షణం. ఒక్క అనుభవం.

బలహీనంగా వణుకుతున్న చేతులతో మా ఇద్దరి చేతులను పట్టుకుని తన కన్నీటి చేత అతికించాలని చూశాడు. ఈ స్పర్శ గతంలో పగిలిన నా ఏ అనుభవాన్నో అతికించింది. బాధలో, కన్నీళ్ళలో. దుఃఖంలో, కరుణలో, ఏ ప్రేమ అయితే వున్నదో ఆ ప్రేమ నా హృదయం నిండా నిండి నన్ను చైతన్యవంతుడ్ని చేసింది. ఆ అనిర్వచనీయ సౌందర్యం వేపు అనిమిషంగా చూస్తూ నిలబడిపోయాను, ఏ సౌందర్యం వేపు ఎన్నో యుగాలనుంచి నా మనస్సు, నేత్రాలు, ఆత్మ ఎదురు చూస్తున్నయ్యో ఆ సౌందర్యం ఇక్కడ ప్రత్యక్షమైంది. ఈ స్పర్శ గతకాలంలోని అనుభవాల తెరలను నా మనసు ముందునుంచి తొలగించింది.

ఏది పోగొట్టుకున్నాననుకున్నానో ఆ ప్రేమ వేయిజ్యోతుల కాంతితో నా ఆత్మలో నవ్వింది.

కరుణాకరం తృప్తిగా నావంక చూశాడు. కాని ఆయన కళ్ళు మూసుకుపోతున్నాయి. ఆయనకు మరోసారి దగు వచ్చింది. ఆపుకోలేకపోయాడు. నేను గబగబా సిరెంజి సిద్ధం చేయసాగాను. ఆయనకు రక్తం వాంతి అయింది. నా చేతిలో ఇంజక్షన్ బాటిల్ క్రిందపడిపోయింది. నా మనస్సు మొద్దుబారిపోయింది.

సుమ కన్నీళ్లు ముఖమంతా నిండినయి. ఆ కన్నీరు బొట్టుని చెరిపేసింది, చెదిరిపోయిన ఆమె కేశాల్లోంచి విధియొక్క క్రూరకృత్యం నిర్మాణం అయింది. దేవుడు ఫైలులోంచి ఒక కాగితం తీసి నలిపి చెత్త కాగితాల బుట్టలో పడేశాడు.

ఈ రాత్రి మా ముగ్గురి మధ్య పడి పగిలి ముక్కలు ముక్కలైపోయింది. ఆయన జీవితంలో గడియారం ఆగిపోయింది. మాకెవరికి వినపడని పిలుపు ఆయనకి వినపడింది. ఆకాశంలో నీలివిస్తరణను ఛేదించుకుని భగవంతుని సైగ ఆయనకు కనిపించింది. ఈ రాత్రి పాత్రలో నిండిన చీకటిని చీల్చుకుని ఏ అనంతత్వంలోనో ఆయన ఆత్మ అడుగు పెట్టింది. పాంచభౌతిక దేహంలోని "నేను" అస్తమించింది. క్షణికమైన బుడగలోని మినుకు మినుకుమనే వెలుగు ఆ బుడగతోనే ఆరిపోయింది.


కాని ఈ రాత్రి మాత్రం అతని విచిత్రమైన వ్యక్తిత్వంతో గాఢంగా ముద్రవేసుకుని శాశ్వతంగా నిలిచిపోతుంది. మహా నిశ్శబ్దం ఆవరించిన ఈ గదిలో నాకు ఆమెకుమధ్య రాత్రి క్రమక్రమంగా అంతరించి ఆయన స్మృతిని మాత్రం మిగిల్చింది.

"డా-క్ట-ర్!" అంది ఏడుస్తూ సుమ.

ఒక్క ఉదుటన లేచి పల్స్ చూశాను. అందటం లేదు. స్టెతస్కోపు తీసికొని గుండెలమీద పెట్టాను. అయిదు నిముషాల వరకు చైతన్యంతో కొట్టుకుని కష్టాలను సుఖాలను వేదనను కన్నీళ్ళని అనుభవాలను భరించిన హృదయం మూగబోయి నిశ్శబ్ధమైంది.

ఆయన ఇక దగ్గడు. రక్తం కక్కుకోడు నాకోసరం కబుర్లమీద కబుర్లు పెట్టడు. "డాక్టరూ పాపాయిలు పడుకున్నారా. జోల పాడాలా?" అని కబుర్లు చెప్పడు. అన్నిటి కన్నా ఆయిన తన విషాద కథ ఎవరితోను చెప్పుకోడు. దాన్ని తనతోపాటే చరిత్రలో కలిపేశాడు.

తెరమీద నీడలా ఆయన జీవితం అంతరించింది; స్ట్రెచర్ మీద ఆయన్ని తీసుకుని వెళ్ళిపోయారు. సుమ స్థాణువై నిలబడింది ఆమె కళ్లు గాజు బుడ్లలా వున్నయి.



కాంతిచ్ఛటలు

ఫొటో : ఎస్నార్, మద్రాసు



శూన్యాన్ని చూస్తున్నయి. ఆమెలో చైతన్యం లేదు.

నేను ఆమెను ఓదార్చలేకపోయాను.

వసుంధర బెడ్ మారుస్తున్నది. ఉన్నట్లుండి "డాక్టర్" అని అరిచింది.

నా కళ్లు యాంత్రికంగా పక్కమీదకు తిరిగాయి. దానిమీద నల్లగా మెరుస్తూన్న విస్కీ సీసా, దాని ప్రక్క ఒక పొట్లం వున్నయి. వణుకుతున్న చేతులతో తీసి చూశాను. దానిలో మిగిలిన స్మృతిలా కొంచెం విస్కీ వున్నది. పొట్లం విప్పి చూశాను. ఆయన దగ్గును భరించలేక తగ్గటానికి తెచ్చుకున్న తాటి కలకండ అది.

నా ట్రీట్‌మెంటు ఎందుకు వేస్టయిందో ఇప్పుడర్థమైంది. ఆయనతో ఇక ఒక చుక్క కూడా తాగకూడదని చెప్పాను. తాగటం లేదంటునే దౌర్బల్యానికి లొంగిపోయాడు.

ఆ బాటిల్‌లో మిగిలిన విస్కీ ఎన్నో అనుభవాలు కోరికలు, గాయాలు, కన్నీళ్ళు తృప్తిలో అసంతృప్తి, అవ్యక్తమైన బలహీనత. తనని తాను సంస్కరించుకోలేని మానసిక దౌర్బల్యం. ఆఖరిగా ఒంటరిగా మిగిలిన మానవత్వం, అశక్తత - ఇన్నీ కనిపించినయి. వీటన్నిటితో ఆయనమీద జాలి వేసింది.

తగలబడి పోతున్న ఆయన చితితో పాటు కోరికలు కూడ తగలబడినయ్యో లేదో నాకు తెలియదు. తిరిగి రూపంధరించే అతని ఆత్మతో అవికూడ పునర్జన్మ నెత్తుతయ్యో లేదో? కాని మనిషిలో సహజంగా వుండే బలహీనత ఆయన మృత్యు దేవత అయింది. ఆయన తృప్తికి అర్థంలేదు. ఆనందంలో సత్యం లేదు.


* * *

మధుబాబుని పరిచయం చేస్తున్నాను.

మధు నాకు స్నేహితుడు. ఒక విధంగా ఇద్దరం భగ్నప్రేమికులం, ఈ భగ్నప్రేమ మా ఇద్దరి స్నేహాన్ని దృఢం చేసింది.

నా స్థితే మధు స్థితి. నేను శాంతిని పొందలేక పోవటానికి మామయ్య కారణమయితే వాడు ప్రేమించిన స్త్రీని పొందలేక పోవటానికి కులంఅడ్డువచ్చింది. ఆమెమధుబాబు ప్రాణానికి ప్రాణం ఆమె పేరేమిటో నాకు తెలియదు.

మధుని చూస్తే ఈ పెద్దలు ఆచార వ్యవహారాలని ప్రేమిస్తున్నారా, లేక తమ పిల్లలను ప్రేమిస్తున్నారా అనిపిస్తూ వుంటుంది. వాడికి నాకున్నంత ధైర్యము ఆత్మ విశ్వాసములేవు. మొన్నటిదాకా వాడు బ్రతుకుతాడని నమ్మకం లేదునాకు. వాడి ప్రేమ ఒకే వైపునుంచి లేదు. నాకు తెలిసినంత వరకు దానికి సౌందర్యంవుంది. వాడి ప్రేమ అలసిపోయి కరిగిపోతున్న రాత్రిలాంటిదికాదు. శక్తివంతమైనది అది. కాని ఆ శక్తి వాడిని దహించింది. వాడి హృదయము కాలిపోయింది. వాడి ప్రణయయాత్ర తెరచాప దించిన పడవ అయింది. వాడి




మనస్సు ఎక్కడికో కొట్టుకు పోయింది. చిమ్మచీకటిలో మిణుగురు పురుగుని పట్టుకుని దారి చూసుకో వలసిన గతిని వాడు కోరి తెచ్చుకున్నాడు. కాలమనే ఎడారిమీద వాడి చరిత్ర హేళనచేస్తూ వెనక్కి నడిచింది. జీవితానికిగల అర్థాన్ని వాడు విరక్తిలోనే అన్వేషించాడు. ఒంటరి తనానికమించిన శిక్ష వేరే ఏముంది?

ఆమె వెళ్ళిపోయాక వాడిస్థితి మరీ హీనమైంది. వాడి నెవరూ ఓదార్చలేక పోయారు. జీవితమంటే నిర్లక్ష్యం. వాడికి కావలసిన ఆనందం ఇవ్వటానికి మరో స్త్రీ జీవితం సిద్ధంగాలేదు. వాడికి జీవితంలో విప్లవం వచ్చింది. వాడి మనస్సు శూన్యమైపోయింది. నే నెంత ప్రయత్నించినా వాడి మనస్సు మారలేదు. అంతకన్నా నా అశక్తత ఎక్కువేమో? నేనుఓడిపోయినవాడినే. ఇద్దరం జీవితంతో రాజీ చేసుకోవటం చేతగాని వాళ్ళమే. వాడినేం ఓదార్చగలను? ఈ రెండు తమంత తాముగా స్వయంకృతాపరాధంతో అమృతాన్ని పోగొట్టుకున్న మృణ్మయ పాత్రలు. ఎవరు మాత్రం ఎవరిని ఓదార్చగలరు?

మధుని గురించి ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే నా జీవితంలో సగం వాడు జీవించాడు. వాడికి తెలియకుండానే నా జీవితంతో చెలగాట మాడాడు.

* * *

"విచిత్రంగా లేదూ" అన్నది సుమ.

"ఏమిటి?" అన్నాను.

"నేను ఇక్క వుండటం."

"ఎందుకు?"

"ఎందుకేమిటి? మీరెవరు, నేనెవరు? ఎక్కడో పుట్టాను. ఎలాగో గాలికి పెరిగాను. నా జీవితం నా అనేవాళ్ళు లేనిచోట సాగిపోతున్నది."

నేను మాట్లాడలేదు.

ఇన్నాళ్ళు సుమ వసుంధరతో వుంది. నిజానికది సుమ అదృష్టమే అనాలి. ఇన్నాళ్ళల్లో సుమ కొంచెం తేరుకుంది. ఆమెలో దుఃఖం పూర్తిగా పోలేదుగాని ఆమె దాని ప్రభావాన్నుంచి తప్పుకుంది.

"ఇంకా ఎన్నాళ్ళిలా డాక్టరుగారు?"

"అలా ఎందుకనుకుంటారు? మీ కోసరం ఎవరైనా—" సుమ బాధగా నవ్వింది.

"ఇప్పటికే మీకు చాలా ఋణపడ్డాను. నా బంధువులు కూడా చూపని ఆదరణ ఆప్యాయత మీరు చూపించారు. మీ మానవత్వానికి నేనెలా కృతజ్ఞత తెలుపుకోగలనో కూడా తెలీటం లేదు."

"ఒక మనిషి బాధపడుతుంటే సానుభూతి చూపించటం మనిషి ధ. . . అందులో వింత ఏమీ లేదు. మీరు స్త్రీ

సుమ కళ్ళు చెమ్మగిల్లి ..యి.

"నిజంగా ఆ రాత్రి ఎంత భయంకరమైనది డాక్టర్‌గారు. తలుచుకుంటే ఇంకా జలదరిస్తుంది. ఏమిటో తెలియదు. ఎందుకో తెలియదు. రాత్రి వచ్చిందంటే ఆ రాత్రే గుర్తుకు వస్తుంది. ప్రతి రాత్రిలో ఆ రాత్రి ఛాయలు కనిపిస్తయి. ఏదో భయం. ఏదో దిగులు. ఆ అభాగ్యజీవి సజీవమైనవేదన నా హృదయంలో విషాదంగా మ్రోగుతుంది. ఆయన బలహీనప్పు ఉచ్ఛ్వాస నిశ్వాసలు ఈ చీకటిలో నాకుతగులుతూనేవుంటాయి. నిద్రరాని రాత్రి నాచుట్టూ చేరి వికృతంగా నవ్వుతుంది. తన బలహీనతకు తానే బానిస అయి తనమరణాన్నితానేకోరితెచ్చుకున్నాడు.కాని ఆయనలో మంచితనం మరణించదు డాక్టరుగారు. ఆయన రూపం కళ్ళల్లో మెదిలినప్పుడల్లా నా తెలివితక్కువకి ఆయన బలైపోయారా అని బాధ కలుగుతుంది." నేను మౌనంగా వూరుకున్నాను.

"ఇంత బాధలోను నన్నింకా ప్రేమించే వాళ్ళున్నారన్న సత్యంలీలగా హృదయంలో మెదిలి శాంతినిస్తున్నది. నా జీవితంలో పెద్దమలుపు ఇదే." అంది నిట్టూరుస్తూ.

"మీకెవరైనా వున్నారా?" అన్నాను మాట మార్చటానికి ప్రయత్నిస్తూ.

"ఉన్నారు, మీలాంటి మహానుభావులు"

"కేవలం సహాయం చేసినందువల్ల మనిషి మహానుభావుడైతే దైవత్వాని కర్థం వుండదు."

"కాదు డాక్టరుగారు. దేవుడు మనుష్యులకి మనిషి రూపంలోనే వచ్చి ఆర్తి తీరుస్తాడని నా విశ్వాసం. నా దృష్టిలో మీరే భగవంతుడు."

"ఏమిటి దీనర్థం?

నాకు ఆనందం కలిగింది. మళ్ళీ శాంతి నన్ను వరించబోతున్నది.నా ఆత్మశాంతితో నిట్టూర్చింది.

"మీవారు చనిపోవటానికి కొద్ది క్షణాలు ముందుగా నాతో కొన్ని విషయాలు చెప్పారు."

సుమ తలవంచుకుంది.

ఆమె ముఖం నిండా నల్లని కేశాలు విరజిమ్మబడినయి. నల్లని ఆ చీరలో ఆమె విషాదం మూర్తీభవించినట్లుంది.

ఎలా ఈ సంగతి ఆమెతో చెప్పటం?

"మీకు కష్టం కలిగిస్తానేమో కాని, మీ వారి ఆఖరి కోరిక...."

"చెప్పండి డాక్టరుగారు"

"అదే ఎలా చెప్పాలో తెలీటంలేదు."

"నాకింకా అనుభవంలేదు, మీరు మీరు...."

ఆమె నావంక చూసింది.

"ఎలాంటి వార్త అయినా విని తట్టుకోగలను. ఈ శరీరం, మనస్సు కష్టాలతో కాచి పడబోయ బడినయి డాక్టర్! చెప్పండి"

"మీరు మళ్ళీ వివాహం చేసుకుని సుఖపడాలి".

"డాక్టరుగారు" అని అరిచింది సుమ.

ఒక్క క్షణం వూరుకుని "నేను అబద్ధం చెప్పటంలేదు మీతో. ఆ రాత్రి ఆయన నాతో ఈ విషయమే చెప్పారు" అన్నాను.

"మీరు నిజం చెప్పటంలేదనటంలేదు. ఈ ప్రస్తావన ఎన్నోసార్లు నాతోనేతెచ్చారు. కాని నా పరిస్థితి నాది, నే నిక వెళ్ళిపోతాను"

"కోపం వచ్చిందా?"

"లేదు డాక్టరుగారు. వారు చేసిన అప్పులు తీర్చాలి."

"ఎలా తీరుస్తారు?"

"ఆహుతి కాంగా మిగిలింది ఇల్లు ఒకటే అదే అమ్మేస్తాను."

"మరి ఎక్కడుంటారు?"

"మీరు దారి చూపించారుగదా?"

"మళ్ళీ వస్తారా?"

"అదేమిటి డాక్టరుగారు. వెళ్ళిపోవటమంటే పారిపోతానా? మిమ్మల్ని మరిచిపోవటం ఎలా సాధ్యం?"

సరిగ్గా శాంతి ఇట్లానే మాట్లాడేది!

తృప్తితో నిట్టూర్చాను.

నా వేదనకి ఈ రోజు అంతు దొరికింది. నా మనస్సు తేలికయింది. ప్రకృతిలోని ఆనందమంతా నా మనస్సులో చేరి విస్తృతమైంది.

నాలుగు రోజుల తరువాత సుమ వెళ్ళిపోయింది. సుమ విషయం తెలుపుతూ అమ్మకి ఉత్తరం వ్రాశాను.

"ఈనాటికి నా జీవితం స్థిరపడబోతున్నది. నీ అంగీకారం కోసం ఎదురు చూస్తున్నాను."

జవాబుగా టెలిగ్రాం వచ్చింది.

తప్పదు.

హాస్పిటల్ చార్జిని డాక్టర్ కృష్ణకు అప్పగించి బయలుదేరాను.

* * *

రైలు దిగుతుంటే మధు తండ్రి కనపడ్డాడు.

"ఏమండి బాగున్నారా?" పలకరించాను.

"ఆ నా బాగుకేంలే. ఎక్కడ్నించి రావటం?"

చెప్పాను.

"వెళ్ళు నాయనా వెళ్ళు. నువ్వయినా బుద్ధిమంతుడివి" అన్నాడు.

ఆయన మాటల్లో వ్యంగ్యం ధ్వనించింది.

"మధు బాగున్నాడా?"

"ఆ(. బాగానే ఉండి వుంటాడు. అయినా తెలీనట్లు అడుగుతావేం? మొత్తానికి మీ అందరు ఒకే బళ్ళో చదివారు."

"ఏమిటి?" అన్నాను ఆదుర్దాగా,

"ఏమిటేమిటి? మధు ఎక్కడున్నాడో నీకు తెలియదా?" అన్నాడు నా ముఖంలోకి గుచ్చి గుచ్చి చూస్తూ.

"ఏమిటి, నాకు నిజంగా తెలీదు."

"నేను నమ్మనులే."

ఈయనతో ఇదే గొడవ. ఏదీ సరిగ్గా చెప్పడు.

"నమ్మినానమ్మకపోయినా నిజం నిజమే. నాకు తెలీదు."

"అదే, వాడి ప్రియురాలు ఉత్తరం వ్రాసిందిట.

"నువ్వు తప్ప నా కెవ్వరు లేరు, నీతో



లేచిరావటానికి సిద్ధంగా వున్నాను" అని. ఇంకేం ఈ భ్రష్టుడు వెళ్ళాడు. ఓ రాత్రికి రాత్రి ఎవరికీ చెప్పకుండా ఓ ఉత్తర ముక్క రాసి పెట్టి వెళ్ళిపోయాడు."

"అయితే ఎక్కడికి వెళ్ళాడు?"

"చెబుతే కదా తెలిసేందుకు? అయినా వాడికి మే మెవరంలే. నీలాంటి వాళ్ళున్నారుగా బాగు చేసేందుకు?"

"ఎన్నాళ్ళయింది?"

"వారం రోజులయి వుంటుంది. నాకేమి దిగులు లేదనుకో. అదే దిగులు పడింది. కాని వాడికి ఉండాలి ఆ జ్ఞానం. అక్కడికి చెప్పి చూశాను, ఉహూఁ లాభంలేదు. మీ కుర్రవాళ్ళకి అనుభవంలేని ఆవేశం. ఏం చేయను? నాకు పుట్టాల్సిన కొడుకు కాదు వాడు. పోనీ, అసలు పుట్టనే లేదనుకుంటాను. రాడికోసరం బాధపడి నేను భ్రష్టుడ్ని కాలేను. ఇప్పుడు ఈ దొర లేకపోతే మేము వున్నామ నరకాన పడతామా?"

ఆయన ఏదో చెప్పుకు పోతున్నాడు. ఆయన ముఖం కోపంతో ఎర్రబడింది. నలుగురు చుట్టూ వున్నారనికూడా లేకుండా మధ్య మధ్య భరతనాట్యం చేస్తున్నాడు.

నేను మాట్లాడలేదు.

ఆయన స్వభావం నాకు బాగా తెలుసు. నేను మాట్లాడితే ఆయన రెచ్చిపోతాడు,

అసలు మధు ఈ స్థితికి రావటానికి కారణం ఆయన. ఆ రోజు ఎవరు చెప్పినా విన్నాడా? ఇన్నాళ్లు మధు ఎలా బ్రతికాడో తెలీదా ఆయనకి? ఎంతకఠినం ఈయన హృదయం? ఆమెని దూరం చేయటంలో కృతకృత్యుడై నాడుగాని, దానితో కొడుకు జీవితంలో ఎంత వెలితి ఏర్పడిందో గ్రహించ లేదు. వాడి ఆనందానికి పక్షవాతం వచ్చింది. మృత్యువును ఎంతో దగ్గరగా చూశాడు. తన జీవితాన్ని తానే త్యాగం చేయటానికి కూడ సిద్ధపడ్డాడు. చిక్కుపడ్డ దారమే అయింది వాడి మనస్సు. తనంత తానుగా కొడుకు జీవిత పుటలను చింపుతున్నాడని తెలీదు ఆయనకి. అది ఆయన పట్టుదల. మూఢ విశ్వాసం. అందరు తండ్రులు పిల్లల్ని ప్రేమిస్తారు. కాని చాలా కొద్ది మంది వారినర్థం చేసుకుంటారు. తండ్రి ప్రేమ బాధ్యతతో కూడినది. తన మూర్ఖత్వంతో వాడి వ్యక్తిగత జీవితాన్ని ఛిన్నాభిన్నం చేశాడు. అది ఆయన గ్రహించడు సరికదా, ఎవరైనా చెబుతే కూడా అంగీకరించడు. తన మూర్ఖత్వంతో ఇతరులని శాసించాలని చూస్తాడు.

"మరి నే వస్తా. నీతో మాట్లాడుతూ కూర్చుంటే అవతల రైలు వెళ్ళిపోతుంది. అయినా నీతో మాట్లాడేందుకు ఏముంది గనుక?"

నేను మాట్లాడలేదు.

ఆయన వెళ్ళిపోయాడు.

ఇంటికి చేరుకునేసరికి పదయింది. మామయ్య చిందులు తొక్కుతున్నాడు.

"వాడెందుకు వస్తాడమ్మా? టెలిగ్రాం ఇచ్చినా రాడు. ఉత్తరం వ్రాసినా రాడు. వాడికిప్పుడు నేను కనిపిస్తానూ? ఆ మధుగాడొకడు వీడికి తోడు, ఇద్దరు తోడు దొంగలు."

"మీ మాటే మీది, వాడు రానేవచ్చాడు" అంది అత్తయ్య.

క్షణం మామయ్య మాట మార్చేశాడు.

"ఏరా బండి లేటా? అనుకున్నాలే. అయినా ఈ బండి ఏ రోజు సరియైన టైంకి వచ్చిందిలే, ఇంకా కూర్చుంటావేం? కాళ్ళు కడుక్కో, స్నానం చేస్తావా? కల్యాణి, బావకేంగావాలో చూడవే.

నేను మాట్లాడలేదు, ఇక్కడొక అగ్ని పరీక్షని ఎదుర్కోవలసి వస్తుందని తెలుసు. కాని అందుకు నేను సిద్ధంగా లేను. ముఖ్యంగా నేను అమితంగా ప్రేమించి గౌరవించే స్త్రీ ఒకతె వుంది. ఆ జీవ సదాత్మానికి బాధ కలిగించటం నాకిష్టంలేదు".

"కాళ్ళు కడుక్కో బావా" కల్యాణి నీళ్లు తెచ్చింది.

"అక్కడ పెట్టు."

మామయ్య ముఖం చిట్లించాడు.

"చేతికివ్వమ్మా."

నాకు తెలుసు. ఆయన ముందు నుంచే ఎత్తులు వేస్తుంటాడు.

క్షణం వూరుకుని కల్యాణి చెంబుక్రింద పెట్టి వెళ్ళిపోయింది.

"త్వరగా కానీ, భోజనం చేద్దాం ఇవ్వాళ. అన్నీ నీకిష్టమైనవే."

"ఇప్పుడే ఆకలి లేదు. నువ్వు భోంచెయ్యి."

"నాకు తెలుసురా. మీకు భోజనం ఎందుకు, ఆ హోటల్లో నానా చెత్త తింటారు. కడుపునిండదు, బలము వుండదు, ఆరోగ్యము చెడుతుంది. ఏం కుర్రవాళ్ళోయ్? మేం చూడు అసలు మా రోజులే వేరు. పెద్దవాళ్ళు ఎంత చెబుతే అంత. నిల్చోమంటే నిల్చోటం కూర్చోమంటే కూర్చోటం. మా నాన్న "కామేశం నీకు



ప్రణయజ్యోతి

చిత్రం : టి. గంగాధర్.

పెళ్ళిరా" అన్నాడు. అంతే పిల్లని చూపించటం నచ్చిందా అని అడగటం ఏం లేదు. అంతే, సరేనన్నా అనేసి మంగళ సూత్రం కట్టేశాను. అహఁ. మాట వరుసకి చెబుతున్నా—"

ఉపోద్ఘాతం మొదలయింది.

"నిజమే మామయ్యా మీకు మాకు చాలా భేదం వుంది. మీరు జీవితంతో చాలా తేలిగ్గా రాజీ పడగలరు. ఎందుకంటే మీకు మీరుగా జీవితాన్ని గురించి ఆలోచించరు. మీకు కావలసిన నిర్ణయాలు మీ పెద్దవాళ్ళు చేసేవారు. మీరు ధర్మం పేరిట ఆచారాన్ని మీ కనుకూలంగా మార్చుకున్నారు. కర్మ పేరిట సంతృప్తిపడి మిమ్మల్ని మీరు రక్షించుకోటానికి ప్రయత్నించుకున్నారు. కాని అది ఆత్మవంచనని మీరు గ్రహించరు. మీరు చెప్పిందే వేదం. మీతరానికి మాతరానికి నాగరికత పేరిట కాలం ఎంతో మార్పు తెచ్చింది. ఆ మార్పుని మీరు గుర్తించరు"

మామయ్య ముఖంలో మార్పు. ఒకసారి అమ్మవంక, అత్తయ్య వంకచూశాడు.

"లే భోంచేద్దాం" అంటూనే లేచాడు. భోజనం చేస్తున్నంతసేపు లేని ఆప్యాయతంతా ఒలకబోశాడు.

భోజనం చేశాక "కళ్యాణీ, బావకి వక్కపొడి పెట్టు—అన్నీ చెప్పాలిటే—ఇలా అయితే రేపు కాపురానికి వెళితే ఎలాగే?" అన్నాడు.

కల్యాణి వక్కపొడి తెచ్చి ఇస్తుంటే "కల్యాణికి నువ్వంటే ఇష్టంరా" అన్నాడు.

"సరే, ఇంతకు ఎందుకు టెలిగ్రాం యిచ్చింది?" అన్నాను.

"అదే నీ పెళ్ళి విషయం" అన్నాడు మంచంమీద కూర్చొని చుట్ట చుట్టుకుంటూ.

"వ్రాశానుగా."

"కూర్చో, లేకపోతే పడుకుంటావా—అఁ, ఏమంటావు. వ్రాశావు. కాని ఒక్కసారి ఆలోచించు. ఆ అమ్మాయి ఎవరు? ఒక వితంతువు. చివరికీ గతికిరా నువ్వు దిగజారేది? మన వంశం ఎలాంటిది? అయినా, ఈ బుద్ధి నీకేపుట్టిందా లేక ఆదే మన్నా మందు పెట్టిందా? ఛఛ:"

"ఏం, నాకిష్టమైంది?"

"ఇష్టమైందని అన్నీ చేస్తుంటే సంఘం ఊరుకోదోయ్! సంఘంలో ఉన్నప్పుడు ఆ సరిహద్దు దాటకూడదు. కట్టుబాట్లు విస్మరించ కూడదు."

"ఇందులో నేనేమీ అపరాధం చేయలేదే!"

"వితంతువుని మళ్ళీ పెళ్ళి చేసుకుంటాననటం పాపంకాదు, మనధర్మశాస్త్రాలు...."

"మామయ్యా!"

"నువ్వుచేసే ఈ పనికి మేము క్షమించినా స్వర్గంలో ఉన్న మీ నాన్న క్షమించడురా. పైగా ఆయన పోయేటప్పుడు, "బావా, కల్యాణిని ఈ ఇంటి కోడలు చెయ్యి" అన్నాడు. అలాగేనని చేతిలో చేయ్యివేశాను...."

కూర్చున్న వాడ్నల్లా చప్పున లేచాను.

"నా కిష్టమై నేను చేసుకుంటున్నాను. నేను సుఖపడుతుంటె ఎవరైనా సంతోషిస్తారో లేదోగాని స్వర్గంలోవున్న ఆయన తప్పక సంతోషిస్తాడు. నాకు తెలుసు."

"అంటే అదొక్కటే నీక్కావలిసిందన్నమాట. నా మాట సరేననుకో - పెద్దది మీ అమ్మమాట!"

"మామయ్యా" అన్నాను ఆవేదనతో.

"మా మాటేం లేదంటావు?"

"మేం రెక్కలు వచ్చిన వాళ్ళం! ఎగరటానికి ప్రయత్నిస్తాం. ఎగిరి ఎగిరి అలసిపోయినప్పుడు రెక్కలు నిమిరి విశ్రాంతి నివ్వటానికే మీరు."

"అంతేగాని, నీ మీద మాకేం హక్కు లేదంటావు? చిన్నప్పటి నుంచి పెంచి పెద్ద చేసినందుకిదేట్రా నువ్వు నాకిచ్చేది?"

"ఏం చేశాను? నేను బాధపడి నీ కనుకూలంగా మారేకన్నా. నువ్వు బాధపడకుండా నా కనుకూలంగా మారవచ్చు. సంతోషంతో నన్నాశీర్వదించ వచ్చు."

"బాధ లేకుండా ఎలా వుంటుంది? నీకంటే మేం అక్కర్లేదుగాని మాకు నువ్వు కావాలిగా. రక్త సంబంధం ఎక్కడికి పోతుంది. చిన్నప్పటి నుంచి కల్యాణిని నీ కివ్వాలని ఎంత ఆశ పెట్టుకున్నామ."

ఇంతకన్నా పచ్చి అబద్ధం లేదు. ఒకసారి తనే "ఈ ఫకీరుకా నా పిల్లనిచ్చేది?" అన్నాడు.

"కావచ్చు. కాని చిన్నప్పటి నుంచి కల్యాణిని చేసుకోవాలని నాకు లేదు. నేను నీ కూతుర్ని చేసుకుంటానని ఏనాడు మాటివ్వలేదు."

"ఏం కల్యాణికి ఏం తక్కువ?"

"ఎక్కువ తక్కువల జోలికి వెళ్ళద్దు. ఏం తక్కువని ఒకనాడు నిరాకరించావు?"



"నిరాకరించానా? 'చదువు కానీ,' అన్నాను. దానికిది ప్రతీకారమా?

"లేదు, ఉన్న విషయం చెబుతున్నాను. స్వార్థంతో చూడవద్దంటున్నాను. ఆ విధంగా జరిగినందువల్ల జరిగే దేమీ ఉండదు. రెండు నిండు జీవితాలు అశాంతికి బలి అయిపోతయి."

"ఏమిట్రా అంత అశాంతి?"

"నాకింత చెప్పేబదులు నువ్వే ఆలోచించు. ఆ నాడు శాంతిని దక్కకుండా చేసింది నువ్వు. నీ అహం అడ్డు వచ్చింది. కాని నా బాధ నువ్వు గ్రహించలేదు. నీ మూర్ఖత్వంతో మా ఇద్దరినీ విడగొట్టావు. కాని నీకు లాభించిందేమిటి? శాంతి తండ్రి మీద పగ సాధించానన్న తృప్తి? మానవత్వం ఏమాత్రం వున్నా నువ్వు చేసిన పనికి సిగ్గుపడతావు. ఒక నిర్భాగ్యుడు, నిస్సహాయుడు, దుర్బలుడయిన వ్యక్తిమీద కసి తీర్చుకోటమా? దీన్ని నువ్వనే సంఘం చూస్తూ హర్షించి వూరుకుందేం? ఆయనేం చేశాడు నిన్ను? శాంతిని తలుచుకుని నేనింకా బాధపడుతున్నానని నీకు తెలుసా? ఈ బాధకి నివారణోపాయం దొరకక ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నించానని నీకు తెలియదు. వన్నార్థం చేసుకోటానికి ఎప్పుడు ప్రయత్నించలేదు నువ్వు. నేను నీ చేతిలోని గాలిపటాన్ని కాదు. నా జీవితం సంగతి నాకు తెలుసు. నీ సానుభూతి, సహాయం కోసరం ఒకనాడు కోరిన మాట నిజమే. కాని దాన్ని నీ స్వార్థానికి వాడుకుంటావని నేననుకోలేదు. అందుకు బదులుగా నీవు గీసిన పరిధిలోనే వుంటానని నీకుచెప్పలేదు. నా జోలికిరాకు. ఇది చెప్పటానికే ఇక్కడికి వచ్చాను. నా గుండెల్లో మళ్ళీ అగ్నిపర్వతాన్ని బద్దలు చేయకు."

ఇంట్లో రెండు నిముషాలు నిశ్శబ్దం. వెళ్ళి కటికీ దగ్గర నిల్చున్నాను. వెనుక గదిలోంచి నిట్టూరుస్తున్న శబ్దం వినిపిస్తున్నది. కాని వెనక్కి తిరిగి చూసే ధైర్యం లేకపోయింది.

"విన్నావటమ్మా!" అన్నాడు మామయ్య అమ్మ వంక చూసి.

అమ్మ నా వంక జాలిగా చూసింది.

నేను తల దించుకున్నాను. అమ్మ గుండెల్లో ఎంత సంఘర్షణ జరుగుతున్నదో నాకు తెలుసు. ఆమె కళ్ళల్లోంచి వాడిగా వేడిగా బాష్పకణాలు సహనశీలి అయిన భూదేవిని బద్దలు చేస్తున్నయి. ఈ అనుభవం తన అగ్నికణాల్లాంటి పెదవులతో నా ఆత్మని చుంబించింది. నా ఆత్మ, మనస్సు కాలిపోతున్నాయి.

అమ్మ నా దగ్గరకి వచ్చింది.

"బాబు!" అంది నా చేయి పట్టుకుని. నాలో వేడిగా పరుగులు తీస్తున్న రక్తంపై ఈ స్పర్శ మంచుగడ్డలా అయింది. నా రక్తం చల్లబడింది. ఏదో అశక్తత నన్నావరించింది. ఆమె ముఖంలోని ఆవేదనని నా జీవితంలోని ప్రతి అణువు పదిలపరుచుకుంది.

మామయ్య మీద కసితో ఇన్ని మాటలు మాట్లాడిన నేను అమ్మ ముందు మూగవాడినై పోయాను. నేను జీవితాంతం తట్టుకోలేనంతగా ఆమె కన్నీరు నా మనస్సుని కాల్చింది.

"నన్ను క్షమించమ్మా" అన్నాను.

అమ్మ దీనంగా "పెద్దవాడు. వాడిమాట విను బాబు" అంది.

"వింటాను. కాని ఈ విషయంలో కాదు. నన్ను శాంతితో బ్రతకనియ్యి. నాక్కావల్సింది నన్ను పొందనీ. సుమ లేకపోతే నేను బ్రతకలేనమ్మా."

"అదిగో ఆ పుస్తకాల్లో మాటలే వద్దంటున్నాను. ఇన్నాళ్లు సుమ నీకు తెలుసా? పెద్దది, తల్లి బాధపడుతుందన్నైనా లేకుండా నోటికి వచ్చిందంతా వాగుతున్నాడు. ఏమిటి ఆ అమ్మాయిలో అంత ఆకర్షణ? విఠంతువనా? లేక—"

నేనే శివుడ్నయితే నా చూపుకి ఆయన మసి అయిపోయేవాడు. ఆయన అదృష్టం. నేను సామాన్య మానవుడ్ని.

"బ్రతకటం చేతకాని వాళ్ళందరూ ఇదే మాట! ఛీఛీ - ప్రపంచంలో సగంమంది ప్రేమవలననే పాడయినారు" అన్నాడు. ఉత్తరీయం వేసుకుని బయటకు వెళ్ళిపోయాడు.

అమ్మ ఒక్కసారి కల్యాణిని చేయిపట్టి తీసుకువచ్చింది.

"ఒక్కసారి కల్యాణిని చూడరా. ఏం తక్కువని వద్దంటున్నావు?" అంది.

"ఆకలి వేస్తున్న మనిషికి అన్నంతింటే కడుపు నిండుతుందిగాని డబ్బు చేతిలో పెటుకుంటే కడుపు నిండుతుందా అమ్మా? కల్యాణి ఆ డబ్బులాంటిది. దానికి విలువ లేదని ఎలా అనగలను?" కల్యాణి పెదవులు వణుకుతున్నాయి. కనుకొలకులలో ముత్యాల బిందువులు గూడుకట్టుకుంటున్నాయి.

మామయ్య తిరిగి వచ్చాడు నలుగురు పెద్ద మనుష్యులను వెంటబెట్టుకుని.

"నువ్వు విను పరంధామయ్యా, పెద్ద మనిషివి, నీకు తెలుసుగా. ఆ రోజు ఈ శివరామయ్య ఏదో మంచి సంబంధం చెబితే "వద్దు. సంబంధం నిశ్చయమైంది. మా మేనల్లుడే -" అని వదులుకున్నానా" లేదా? అందాకా ఎందుకు మొన్న శాస్త్రుల్లు ఒకటో నెంబరు సంబంధం తెచ్చాడు. పిల్లవాడు ఇంజనీరు. కట్నంకూడ వద్దన్నాడు దాన్ని చూసి. అదీ వదులుకున్నానా? ఎందుకని అడుగవేం? మేనల్లుడు కావలిసినవాడు. రక్త సంబంధం అనేకదా? మొన్నటిదాకా సరేనన్నాడు. ఇప్పుడు వద్దంటాడే! ఏం చెప్పాలి?"

ఇవెంత అబద్ధాలో నాకు తెలుసు. వేరే సాక్ష్యం అక్కర్లేదు. నిజానికి అంతమంచి సంబంధాలేవస్తే ఆయన జన్మలో వదులుకోడు.

"చూడు బాబు. నువ్వు చిన్నవాడివి. పెద్ద వాళ్ళం మా మాట విను. దూరాలోచన మాది. మంచి చెబుతాము. ఆయన ఆశలన్నీ నీమీదే వున్నాయి."

"దూరాలోచన కాదు. దురాలోచన" అనుకున్నాను.

"మీ సంగతి తెలుసయ్యా. పొంగే పొంగే పాలు."

"ఆశ ఎవరికైనా వుంటుంది. ఆ ఆశతోనే ఆ రోజు అమ్మ నోరు తెరిచి అడిగితే కాదన్నాడు."

మామయ్య లేచాడు.

"కాదన్నానా? చూద్దాం లేమ్మా అన్నాను"

అన్నాడు.

"ఏమన్నావో నీ మనసుకు నీకు తెలుసు నా మనస్సుకు నాకుతెలుసు. అయినా నీతో నాకేమిటి? నేను కల్యాణిని చేసుకోను అంతే."

అమ్మ, అత్తయ్య అయోమయంగా వంటింటి గుమ్మం దగ్గర నిల్చుని చూస్తున్నారు.

మామయ్య వూరుకోలేదు. పరంధామయ్యని ఎగదోశాడు.


"విన్నావా పరంధామయ్యా?"

"అయినా ఈ కాలపు కుర్రవాళ్ళతో పెద్ద చావొచ్చి పడిందయ్యా మా మేనల్లుడు అంతే. మా అమ్మాయిని చేసుకోనంటాడు. వీళ్ళకి ప్రేమట -ప్రేమ!"

"ప్రేమను గురించి మిమ్మల్నెవరు అడుగలేదు. అయినా నాక్కావల్సింది ప్రేమ కాదు. శాంతి. ఇష్టంలేని పెళ్ళి బలవంతాన చేస్తే ఎవరు సుఖపడరు."

"ఏమిటో అంత అశాంతి?"

నాకు కోపము,విసుగు రెండూకలిగాయి. "మీ అందరికీ సమాధానాలు చెప్పే అవసరం నాకు లేదు. మీ రంతా ఎవరు? ఇది కోర్టు కాదు. నేను ముద్దాయిని కాదు. ఇది నా స్వంత విషయం. నా జీవితానికి హద్దులు నిర్ణయించేందుకు మీ రెవరు? ఇన్ని మంచి సంబంధాలు తేగలిగిన మీరు ఇంకా వంద తేగలరు. ఇచ్చి చేసుకోండి."



ఆ మాట నువ్వు చెప్పనక్కరలే. కాని ఇంతదూరం వచ్చి అల్లరిపడ్డాక దానికి పెళ్ళవుతుందీ?''

"దానికి నేనేం చేసేది."

"పోనీవయ్యా మా అమ్మాయి వద్దు. ఎవర్ని చేసుకుంటే? వితంతువుని. సంఘ సంస్కర్తలు బయలుదేరారు, అప్రతిష్ఠ!"

శివరామయ్య ముక్కుమీదకు వేలు పోయింది. "ఏం జీతగాడితో లేచి పోవటం కన్నా అప్రతిష్ఠనా?''

చప్పున శివరామయ్య ముఖం నల్లబడింది. "వెనక్కి తిరిగి చూసుకుంటే ఎవరి చరిత్ర వారిని వెక్కిరిస్తూనే వుంటుంది. ఆత్మ పరిశీలన చేసుకుంటే ఎవరెంత పాపాన్ని మూటగట్టింది తెలుస్తుంది? ఎకరెకరమ్మేటప్పుడు, పొలాలు గట్లు జరుపుకుని అవతలవాళ్ళ పొలాలు కలుపుకునేటప్పుడు — చివరకు పాఠశాల కట్టేటప్పుడు. ఎన్ని ఘోరాలు జరిగినయ్యో ఆ భగవంతుడికి తెలుసు. అవన్నీ బయటకువస్తే ఈ పెద్ద మనుష్యులంతా ఎక్కడుంటారో? ఇప్పటికి జరుగుతున్న దేమిటి? ఇంతకన్నా అప్రతిష్ఠనా?''

ఇక తెగించకపోతే లాభంలేదు.

ఉయ్యాల బల్ల గొలుసు పట్టుకుని చూస్తున్న పరంధామయ్య తలదించుకుని ఓరగా చూస్తున్నాడు. శివరామయ్య ఆశ్చర్యంగా నోరు తెరిచి నావంకచూసి వెంటనే జేబులోంచి ముక్కుపొడుము తీశాడు. మిగిలిన ఇద్దరు ఒకరి ముఖాలుఒకరు చూసుకున్నారు. అందరి ముఖాలు కోపంతో ఎర్రబడినయి.

చాలాసేపు నిశ్శబ్దం.

"పరువు ప్రతిష్ఠల జోలి మీకెందుకు? మీకు మంచివాడ్నయి అశాంతితో బాధపడలేను.''

''శాంతి మనం కల్పించుకోటంలో వుంది''

మావయ్య సమాధానం.

ఆయన ముఖంచూడాలంటే అసహ్యంగా వుంది.

తను ఆడే కపటనాటకానికి తోడుగా ఎంతమందిని తెచ్చుకున్నాడో?

నేను మాట్లాడలేదు.

"ఇంతసేపట్నించి చూస్తున్నాం? ఎందుకేంటికని? మరీ తెగించి పోతున్నావే? ఈ పెళ్ళి ఎట్లా జరుగదో మేము చూస్తాం. మీ మామయ్యకి జరిగిన అవమానం మాకు జరిగినట్టే. ఈ ప్రెసిడెంటు తలుచుకుంటే-"




"ఏం బెదిరిస్తున్నారా? సరే, నేను చని పోవటానికి సిద్ధంగా వున్నాను. అశాంతితో బతికేకన్నా కన్నుమూస్తేనే మంచిది. గొడవ వుండదు."

నా నుంచి ఈ సమాధానం ఆశించి వుండరు. అమ్మ గబగబ లేచివచ్చి నాచేయి పట్టుకుంది. నా అనంత జాగృతి ఒక్కసారి మూసుకుపోతున్నట్లనిపించింది. భరించలేని ఆత్మీయతతో విలవిల్లాడి పోయింది మనస్సు. ఏదో దౌర్బల్యం నన్నావహించింది. నా శరీరమంతా స్వేద బిందువులతో నిండిపోయింది. అమ్మవంక చూశాను.

"ఆవేశపడకు బాబు. స్థిమితంగా ఆలోచిం. జీవితంలో అన్ని ఆశలు నీ మీదే పెటు దాన్ని. నువ్వే ఇలా మాట్లాడితే నేనేం కాను? నేను బ్రతుకుతున్నానంటే అది నిన్ను చూసుకునే. నీ బాధ నాకు తెలుసురా! కాని బాధ అనుకుంటే బాధ."

"అమ్మా!"

అమ్మ కళ్ళు చెరువులయినయి.

నా గుండెల్లో చేతులు పెట్టి దేవినట్లయింది. నా మనస్సు అల్లకల్లోలమై పోయింది. ఎన్నో భావాలు కరుకుగా హృదయాన్ని కోస్తున్నయి. ఇది భావుకం దని మానసిక పరిణామం. నేను ఓడిపోతున్నాను. నా కళ్ళవెంట నీటిచుక్కలు రాలినయి. దురదృష్టవశాత్తు ఈ అశ్రువులకి స్వరం లేదు.

"చూడు నాన్నా ఒక శుభకార్యం కోసరం దౌర్జన్యం జరగటం ఏమిటి? నా పంచ ప్రాణాలు నీ మీదే వున్నాయి."

"నేను లోలోపల కుళ్ళి కుళ్ళి ఏడ్చాను. మామయ్య సంగతి అమ్మకి బాగా తెలుసు. అమ్మ అలా మాట్లాడటంలో ఆశ్చర్యం లేదు. ఆయన స్వార్థం చూడకుండా ఏ పని చేయడు."

"ఊరుకో శివరామయ్యా. ఎందుకలా మాట్లాడుతావు? ఏదో ఆవేశంలో వాడంటే మాత్రం నువ్వలా తొందరపడటం ఏమీ బాగలేదు. పొంగే వయస్సు వాడిది. వేడి తగ్గగానే అదే చల్లారిపోతుంది.

శివరామయ్య తోక తొక్కిన త్రాచల్లే లేచాడు.

"నువ్వు ఇలాగే అను. పెద్దంతరం చిన్నంతరం లేకుండా బరితెగించిపోతున్నారు. ఇదే నా మేనల్లుడయితే నాలుగు వాయించి వుందును. ఇక్కడికి రావటం నాదే తప్పు. ఎప్పటికయినా మీరు మీరు ఒక్కటే—"

శివరామయ్య ఉత్తరీయం దులుపుకుని వెళ్ళిపోయాడు.

నేనక్కడ నిల్వలేక వెళ్ళిపోయాను.

ఏదో ఆరాటం. గుబులు, దిగులు — ఏమిటీ ఈ బలహీనత? అసలు ఇక్కడికి రావటమే తప్పేమో? నా మీద నాకే కసి. ఈ జీవితం నాకు సరిపడదు. దీనితో భగవంతుడు జరిపే ప్రయోగాలకి తట్టుకో

లేకుండా వున్నాను. నా జీవ శక్తులన్నీ కర్పూరంలా హరించుకుపోతున్నాయి. ఈ కపట నాటకంలో విజయలక్ష్మి మామయ్యని చూసి చిరునవ్వు నవ్వింది. అంతేగాని వరించలేదు. ఎలాగైనా ప్రతీకారం చేయాలి. ఈ వాతావరణంనుంచి పారిపోవాలి!

నా కళ్ళల్లో సుమ మెదిలింది. సుమ దేవత. నా కోసరం అవతరించిన శాంతి. సుమ ఒక అపూర్వమైన అనుభవం. ఆమె ఒడిలో తీయని ప్రశాంతి.

రోజంతా ఇవే ఆలోచనలు. ఏం చేయాలో తోచదు. పిచ్చి ఎక్కినట్లుగావుంది.

మామయ్య హడావుడి ఎక్కువగావుంది. ఆయన ఏర్పాట్లు చేస్తున్నాడు.

"బావా!"

ఆలోచించటం మానేసింది మనస్సు.

"బావా!"

వెనక్కి తిరిగి చూశాను. కల్యాణి.

"కాఫీ! అక్కడ పెట్టివెళ్ళు."

"వెళ్ళటానికి రాలేదు. నీతో మాట్లాడేందుకు వచ్చాను."

"నాతో ఇంకా ఏం మాట్లాడుతావు? అదంతా మీనాన్నే మాట్లాడేశాడు."

"నేనంటే ఇష్టంలేదా బావా?"

కల్యాణి లోపలికి వచ్చి కుర్చీలో కూర్చుంది.

"ఆ ప్రశ్న ఇప్పుడనవసరం."

"కాదు. చాలా అవసరం."


"ఎందుకడుగుతున్నావు?"

"జవాబు కావాలి కనుక."

"జవాబు నీదగ్గరే వుంది."

"నాకు తెలియదు బావా."

"నేను చెప్పలేను కల్యాణి."




"అయితే, ఈ సమస్యకి పరిష్కారం కుదరదు. నీ జీవితాన్ని నీకు నీవుగా బలి చేసుకుని త్యాగమని సంతృప్తి పడలేవు."

నిట్టూర్చాను.

నా హృదయం శూన్యమైనట్లు అనుభూతి.

"ఒకరి సంగతి అలా వుంచు. ఎలాంటి పరిస్థితులలోనైనా నిన్ను ప్రేమించగలను. నాకు జవాబు కావాలి. నామీద ప్రేమ లేదా బావా?" చివరి మాటలంటున్నప్పుడు కళ్యాణి గొంతు వణికింది.

"నీమీద ప్రేమ వుందోలేదో నాకు తెలియదు. నేనెప్పుడు అలా ప్రశ్నించుకోలేదు. కాని నిన్ను గౌరవించగలను. ఒకప్పుడు నువ్వు నాకు అవసరమనుకున్నాను. కాని దాన్ని మొగ్గలోనే త్రుంచివేశాడు మీ నాన్న. నీమీద నాకే అభిప్రాయం లేదు."

కళ్యాణి తలవంచుకు కూర్చుంది.

"ఒకవేళ ఈ వివాహం జరగటమే తటస్థిస్తే మనిద్దరం సుఖపడలేం కల్యాణి. నేను నీకు అర్థంకాని పుస్తకంలా తయారైతాను నీలోనుంచి ఆనందం స్వీకరించటం చేతగాని నాకు, నీ నుంచి శూన్యమే దక్కుతుంది."

కల్యాణి ముఖంలో మూగవేదన ప్రతిధ్వనించింది.

నే నక్కడ నిల్చోలేక బయటకి వచ్చేశాను.

పిట్టగోడ పట్టుకుని నిల్చున్నాను.

కల్యాణి నా వెనుకే వచ్చింది.

"నాలో శాంతిని చూసుకోలేవా బావా?"

పాడుబడిన ఆలయం వంక చూస్తున్న వాడ్ని కల్యాణి ప్రశ్నతో ఉలికిపడ్డాను.

ఆ ప్రశ్న నా హృదయాన్ని ముక్కలు చేసింది.

"చెప్పు బావా!"

మూగతనం మళ్ళీ సన్నావరించింది.

కల్యాణి నా ఎదురుగా వచ్చింది. నా మౌనానికి ప్రతిధ్వనిలా.

"మరి ఇక్కడకు ఎందుకొచ్చావు బావా" అంది గాద్గదికంగా.

ఎందుకు వచ్చాను?

మలినమైన ముఖాన్ని ఆమెకు చూపే ధైర్యం లేక తలదించుకున్నాను.

"నువ్వు రాకుండా ఉండాల్సింది."

"అవును కల్యాణి. కాని అమ్మకోసం రావల్సివచ్చింది."

"అత్తయ్య ఏం చేస్తుంది బావా! నాన్నకెదురు చెప్పలేక, నీ బాధ చూడలేక కుమిలిపోతున్నది. నాన్న ఎప్పుడు స్వార్థంతోనే ఆలోచిస్తాడు. అవతల జీవితాలు నాశనమైపోతున్నా లెక్క చేయడు" ఒక్కసారి నా మనస్సు చల్లబడిపోయింది.

"ఏమిటి కల్యాణి?"

"నా కంతా తెలుసు బావా, శాంతి నాతో వచ్చేటప్పుడు నీ సంగతంతా చెప్పి మరీ వెళ్ళింది.

"ఆమె కన్నీళ్ళతో నీ జీవితాన్ని చక్కబరుస్తానని, నిన్ను సుఖపెడతానని ప్రమాణం చేశాను. అందుకే నీతో వివాహమంటే ఎంతో సంతోషించాను. ఇన్నాళ్లు నీకోసమే నిరీక్షించాను. కాని నేనే నీకు ఎండమావినైనానని తెలుసుకోలేకపోయాను. నా దురదృష్టం—"

కల్యాణి పమిటి చెంగుతో కన్నీళ్ళు తుడుచుకుంది.

నా స్థితి దిగజారిపోయింది.

నల్లని చీకటి విషాదంగా మా ఇద్దరిని ఒడిలోకి తీసుకుంది.

ఆలయం ప్రక్కన చెరువులోని నీళ్ళు సలుపెక్కినయి. ఉదయం నుంచి గలగల్లాడిన అలలు అలసి నిదురబోతున్నాయి.

నా జీవశక్తులన్నీ పాలిపోయి నిర్జీవమైనాయి.

"ఎందుకో చెప్పలేను కల్యాణి. నువ్వెప్పుడు నాకు అందని ద్రాక్షపండులాగే అనిపిస్తావు. అందుకే నిన్ను గురించి ఆలోచించలేదు ఎప్పుడు. కాని నీ వ్యక్తిత్వం గొప్పది. నిన్ను పొందటం అదృష్టమే అయినా దాన్ని స్వీకరించేశక్తిగాని, ధైర్యంగాని నాకు లేవు! నాకు కావలసింది శాంతి. బహుశా కొన్ని జన్మలు ఎత్తినా మరిచిపోలేని ఒక విషాద స్మృతి నన్నావరించి వుందని నీకు తెలియదు. ఏ నీడైనాదొరికితే చాలనుకుంటున్న వాడిని నేను. కాని మామయ్యలా జీవితాన్ని తేలిగ్గా తీసుకోలేను. నాకు కావలసింది ముక్తికాదు. విముక్తి."

కళ్యాణి కొంచెంసేపు మౌనంగా కూర్చుంది.

"ఎవరా అమ్మాయి?"

"ఎవరు?"

"నువ్వు ప్రేమించిన స్త్రీ."

మళ్ళీ నా గొంతు మూగబోయింది.

"చెప్పు బావా?"

"విని ఏం చేయగలవు కళ్యాణి? నాలో ఉన్న కొన్ని బలహీనతలకి నేను లొంగిపోయాను. నన్నొక ఆట వస్తువుగా భావించారంతా."

"అదంతా తరువాత సంగతి. ముందు ఆ అమ్మాయి ఎవరో నాకు కావాలి."

"సుమ" అన్నాను తల వంచుకుని.

"నాకంటే అందంగా వుంటుందా?"

"అందం గురించి చెప్పను. కాని ఇద్దరివీ ఒకే రకం అనుభవాలు. ఈ అనుభవాలే మా ఆత్మీయతని మరింత బలపరిచాయి."

"ఎలా పరిచయం నీకు?"

"ఆమె భర్త ఒకప్పుడు నా దగ్గరికి ట్రీట్‌మెంటు కోసరం వచ్చాడు. కాని తన జీవితంలో ఏమీ లేదనుకుని, తన జీవిత పుటలని తానే చింపుకున్నాడు. ఆ ఓటమిలో ఆనందాన్ని అనుభవించాలని ప్రయత్నించి విఫలుడై కన్నుమూశాడు. ఆయన మరణించాక ఆమె నా దగ్గర ఉంది కొన్నాళ్ళు."

కల్యాణి నిట్టూర్చింది. ఆమె పెదవులు కంపిస్తున్నాయి.

"ఆమె నిన్ను ప్రేమిస్తున్నదా?"

"అనే చెప్పగలను. ఎందుకు కల్యాణి గతాన్ని తవ్వుతావు?"

"వెళ్ళిపో బావా? ఇక్కడుండవద్దు?"

నా చుట్టూ ప్రపంచం గిరగిర తిరిగింది.

ఏమిటంటున్నది కల్యాణి?

"ఏమిటి కల్యాణి?" అన్నాను ఆవేదనతో.

"అవును బావా. ఆమె ఎవరైతేనేం? నువ్వు సుఖపడటమే నాక్కావాలి. శాంతికి ఆ రోజు అలాగే ప్రమాణం చేసేను. వెళ్ళిపో."

రెండు క్షణాలు ఇద్దరిమధ్యా నిశ్శబ్దం.

నా హృదయంలో ఎవరో విలపిస్తున్నారు.

ఏమిటి త్యాగం.

"ప్రేమించినందుకు నా బాధ్యత ఇదే బావా. ప్రేమ పవిత్రమైతే దానికి ప్రతిఫలం ఎందుకు?"


నిరుత్తరుడ్నైపోయాను.

మా ఇద్దరి మధ్య చాలా సేపు నిశ్శబ్దం పేరుకు పోయింది.

"కల్యాణి" అన్నాను.

నాకు తెలియకుండానే నా గొంతులో దుఃఖం చేరింది. నా ముఖం కన్నీళ్ళలో మునిగిపోయింది.

కల్యాణి దిగులుగా చూచింది. నా హృదయం బరువెక్కిపోయింది. కొన్ని కలలకు రూపమే గాని అర్థం వుండదు. ఇదీ అంతేనేమో? ఇందులో తృప్తిలేదు.




ఒక విధంగా ఇది అనుభవంలోకి రాని ఆనందం. కల్యాణి మాటలలో ఎంత చల్లదనం వుందో అంత వేడి వున్నది. ఎంత కాంతి వున్నదో అంత వేదన వున్నది. ఎందుకోసరం తనని తనే అన్యాయం చేసుకుంటున్నది కల్యాణి? పొందగలిగి కూడా త్యాగం చేస్తున్నది కల్యాణి. ఈ అమాయకురాలా? అత్యున్నతస్థితికి పోయిన దేవత?

కల్యాణి కళ్లు తుడుచుకుని "ఉండుబావా నీడబ్బు తెచ్చిస్తాను." అని వెళ్ళిపోయింది.

కల్యాణి ముఖం చూడలేక పోయినాను. ఆకాశం పొగ జారిపోతున్నది. క్రమంగా చీకటి జగద్వ్యాప్తమౌతున్నది.

దిగంతాల నుంచి గోవులు తిరిగి వస్తున్నాయి.

ఆనందంగా గోపాలకులు పిల్లనగ్రోవి ఊదుతూ వస్తున్నారు.

ఆ నాదం ఏదో స్మృతిలా జీవితంలోంచి దూసుకు పోతున్నది. ఏదో ఆత్మీయత ఏదో అనుబంధంతో మనస్సు విలవిల్లాడింది.

ఈ ప్రకృతి మౌనంలో, ప్రేమ చైతన్యశక్తిలో, ఆనందం పూర్తిగా ఇంకి పోయిన జీవితపు ఎడారిలో, మండు వేసవిలో అశాంతితో, దాహం తీరక, నీడకోసరం పరితపించే భగ్న ప్రేమికుడ్ని తన ఆప్యాయతతో త్యాగంతో సేదతీర్చి మళ్ళీ మనిషిని చేసింది ఎవరికీ తెలియదు. తెలిసినా దాని విలువను గుర్తించే వాళ్ళు చాల కొద్దిమంది. చరిత్ర కందదు, దొరకదు. మనిషికీ మనిషికి ఉండే అంతరం చాల పెద్దది.

ఇప్పుడు నా కళ్ళకు కల్యాణి అభం శుభం తెలియని పల్లెటూరి పిల్లగా గాక అద్భుత జ్ఞాన సంపన్నురాలుగా కనపడింది. కల్యాణిని గురించి నా అంచనా అంతా తారుమారయింది. కల్యాణి వ్యక్తిత్వం ఇప్పుడు బయటపడింది.

ఏమైనా నాది మృత సంస్కారంకాదు. నా సంస్కారంలో సత్యమున్నది.

చాలా సేపు గడిచాకగాని నేను ఈ లోకంలోకి రాలేదు.

నా కోసరం కల్యాణి ఏం చేయబోతున్నది? ఈ త్యాగం నా వ్యక్తిత్వాన్ని బీటలు వారేటట్లు చేస్తుందేమో? ఈ అనుభవం నా జీవితాన్ని తల్లక్రిందులు చేస్తున్నది. ఈ అనుభవం నా జీవితంకన్నా పెద్దది. అందుకే తట్టుకోలేకుండా వున్నాను.

క్రమంగా నా చుట్టూ చీకటి చేరింది. ఆ చీకట్లో ఎన్నో భావాలు. నా గుండెల్లో ఒక మహా కెరటం విరుచుకుపడింది నా చెవుల్లో ఏదో ఘోష. నా మనస్సు ఆవేశతరంగాలపై నాట్యం చేసింది. ఎన్నో జ్ఞాపకాలు గుండె లోతుల్లో కదులుతున్నాయి. ఒక్కసారి సుమ- శాంతి రాధ జ్ఞాపకానికి వచ్చారు.

పగలు స్పృహ కోల్పోయింది.

ఆ చీకటి మనస్సులా కల్యాణి వచ్చింది.

"ఇదిగో బావా పర్సు."

యాంత్రికంగా చేయి జాపాను.

"వెళ్ళు బావా, రైలు కదులుతోంది."

ఈ త్యాగం నన్ను హీనుడ్ని చేసింది.

"నువ్వు సరేనంటే నీముందు ఆత్మార్పణ చేయగలను. కాని నా నివేదన నీకు అవసరం. ఒకటే నాకు తృప్తి. మనం భగవంతుడికి నివేదన చేస్తాం. దాన్ని ఆయన స్వీకరించాడో లేదో మనకు తెలియదు. కాని ఒక తృప్తి. ఈనాడు ఆ తృప్తే నాకు మిగిలింది. అది చాలు నాకు."

గుండెల్లో ఒక విషాద భావం క్రమ్ముకుంటున్నది. కల్యాణి వియోగం భరించలేనేమో ననిపిస్తున్నది. ఎదురుగా వున్న నీటిని వదులుకొని ఎండమావుల్ని వెంటాడుతున్నానా? ఏమైనా ఆశలో ఆనందం వుంది. ఆ ఆనందంలో తృప్తి వుంది. నిజానికి కల్యాణి "పతిత హృదయాంతరాళ జాజ్వల్యమాన దివ్య విమలానురాగ సందీప్తశాలి."

"ఏమిటి బావా ఆలోచిస్తున్నావు. ఇది ఆలోచించటానికి సమయం కాదు."

నా మనసు మూగబోయింది. అచేతనంగా గోడ నానుకుని నిలబడ్డది కల్యాణి. మనిషిని బ్రతికించటానికి కావలసిన మంచి వుంది కల్యాణిలో.

"కల్యాణి, నన్ను క్షమించగలవా?" అన్నాను ఏడుస్తూ.

కల్యాణి బాధగా నవ్వింది.

"అంత మాటెందుకు బావా?"

"నువ్వు అందని నాడు ఆశించాను. అందిననాడు దూరంగా పారిపోతున్నాను. అదీ పిరికి వాడిలా."

"కాదు. ఆ నింద నామీదే వేసుకుంటాను. నువ్వు కావాలన్న రోజు నీ దగ్గిరికి రాలేకపోయాను. నీ కనవసరమనిపించిన రోజు రావాలని ఆశపడ్డాను. ఇదంతా విధి యొక్క లీల. మనమేం చేయలేం బావా?"

నడుస్తుంటే అనుభవాలు హృదయాన్ని గాయం చేసినయి.


నేను, మామయ్య కల్యాణిని అతిగా ఉపయోగించుకున్నామేమో? కల్యాణిత్యాగానికి కల్యాణినే బలిచేస్తున్నానేమో? ఆతరువాత కల్యాణి సంగతేమిటి? నేనాలోచించలేదు. ఇంత శిక్షని కోరుకోటానికి కల్యాణి చేసిన తప్పు ఏమిటి? నన్ను ప్రేమించటమా?

కల్యాణి నిలా నడిసముద్రంలో వదిలి పారిపోవటమంత పిరికితనం మరొకటి లేదు. కాని అంతకన్నా చేయగలిగిందికూడా లేదు. మనస్సులు తెలియని వాళ్ళని మోసం చేయటం పాపం కాదు. మామయ్యలాంటి వాళ్ళు అమాయకులుకారు. నాచేతో నా కంట్లోనే పొడవగలశక్తి ఆయనకుంది.

రైలు బయలుదేరింది.

చీకటి కప్పుకున్న ప్లాట్‌ఫారమ్ జాలిగా చూస్తోంది.

దూరంగా నల్లని చీకట్లో ఎర్రగా వెలుగుతున్న సిగ్నల్ దీపాలువిధి చూపుల్లా భయంకరంగా వున్నాయి.




క్రమంగా రైలువేగం హెచ్చింది.

జీవితంలో ఇది మరిచిపోలేని రాత్రి. ఈ ఒకటిరాత్రి నా గుండెల్లో నిద్రాణమైవున్న వేదనామయమైన అశాంతిని జాగృతం చేసింది. నాకేం కావాలో ఏమక్కర్లేదో నాకేం తెలియడం లేదు. మనస్సులో ఎవరో ఆత్మీయులు శాశ్వతంగా దూరమై పోతున్నప్పుడు కలిగే బాధ. ఈ ఒక్క క్షణంలో ప్రపంచం నుంచి నేను వేరైనట్లు అనిపిస్తున్నది.

కళ్ళు మూసుకున్నా తెరిచినా కళ్యాణి కనిపిస్తున్నది. మానావమానాలకు సుఖదుఃఖాలకు అతీతమైన స్త్రీ ఆమె.

ఈ అర్ధరాత్రివేళ, నిదురపట్టక, మూతపడిన కనురెప్పల మధ్య నిలిచిన కన్నీళ్ళతో వ్యాకులమైతున్న మనస్సుతో, వివర్ణమైన ముఖంతో కల్యాణిని తలుచుకుని కుమిలి కుమిలి ఏడ్చాను.

* * *

క్షణమనేది జీవితంలో ఏపాటి వంతు?

కాని ఆ క్షణమే నాజీవితంలో విప్లవాన్ని తెచ్చింది. నా ఆశల్ని సమూలంగా పెకలించి పారేసింది.

ఇది భ్రమకాదు. నేనుచూసిన దృశ్యాన్ని నమ్మే శక్తి కూడా లేదు నాకు.

మరో సారి విధి చేతిలో ఓడిపోయాను.

సుమ నేననుకున్నంత అమాయకురాలు కాదా?

లేక నా ప్రేమ నర్థం చేసుకోలేదా?

మరెందుకు నాకీశిక్ష?

దేన్ని ఆశించి ఆత్మీయుల్ని విడనాడుకుని మరొక స్త్రీ ప్రేమని, వేదనని నిరాకరించి ఇంతదూరాం పరుగెత్తుకు వచ్చానో కనీసం దాన్ని చెప్పుకునే అర్హత కూడా లేదు నాకు.

ఇంత విషాదాంతమైన జీవితం ఉండదు. నిరాశకి, నిస్పృహకి మరో రూపంలా వున్నాను నేను. దుఃఖబడబాసలంతో దగ్ధమైపోతున్నది హృదయం.

నెల రోజుల వరకు ఆమె ఎంత మౌనంగా. నిర్లిప్తంగా వుండేది. గోడమీద గడియారంలా తనపని తాను చేసుకునిపోయేది. ఆమె ఎంతో అస్వస్థురాలిగా కనిపించేది.

ఏ సుఖాన్నాశించి ఆమె జీవితం చుట్టూ తిరిగానో, ఏ క్షణంలో ఆమె చూసినచూపు నాలో శాశ్వతంగా నిలిచిపోయిందో – ఇవేవి ఆనందమయమైన జ్ఞాపకాలుగా నాకు మిగలవు. ఊహలతో సుడులుతిరిగే బతుక్కి–

బలమైన కేంద్రంలేదు. అందుకే ఈ ఓటమి.

సుమ నన్ను వదిలి మరో క్రొత్త జీవితానికి బాటలు వేసుకుంది.

జీవితం ఏదో సూత్రాన్నాధారం చేసుకుని నడుస్తోంది. నాలో గూడు కట్టుకున్న ప్రేమ భ్రమ కాదు. మిధ్యకాదు. ఎవర్ని కేంద్రంగా ఈ ప్రేమకి ఆవిర్భావం జరిగిందో ఆమె పొగమంచులా కరిగి జారిపోయింది.

ఎందుకలా ఆడుకుంది నాతో?

నా హృదయంతో? నా ఆత్మతో?

ఆమె తిరస్కరిస్తే నేను "నేను" కూడా మిగలను.

ఇప్పుడేం చేయటం ?

కన్నీరు ఆగటంలేదు. ఏడిస్తే బాధ తీరుతుందని అనుభూతి పొందుతున్నాను.

"ఇక ఆమె నాకు దక్కదు" హృదయంలో ఏ మూలనుంచో ఈ సత్యం భయంకరంగా మ్రోగుతున్నది. అసలా రోజు దీపమెందుకు వెలిగించాను? సుమ ఎందుకు కనిపించాలి?

కలలాంటిది జీవితం. సముద్రం లాంటిది ఆశ. కనులు తెరిస్తే సముద్రంలాంటి ఆశ కరిగిపోతున్నది.

సుమకోసరం నేను తెచ్చిన పూలు జాలిగా నన్ను చూస్తున్నయి. కల్యాణి ఇచ్చిన సంపెంగ పువ్వు చేతిలోంచి రాలిపడిపోయింది. రేకులు ఊడినయి. ఇది జీవన లీల రెండోభాగం. నాలాంటి వారికి జీవితం ఒక సత్రంలా మజిలీకేంద్రం. ఎవరో అదృష్టవంతులు జీవితాన్ని తాజమహల్‌గా చేసికుని చిరస్మరణీయులై తరిస్తారు.

ఒక్కసారి నా రక్తం పోటు హెచ్చినట్లయింది. హృదయం వేగంగా స్పందించ సాగింది.

వాళ్ళు నన్ను చూడలేదు. చూడకపోవటమే మంచిదయింది. చూడకముందే పారిపోవాలి.


ఎక్కడికి?

ఇన్నాళ్ళు అసూయ ద్వేషాల కతీతంగా పెరిగాను. కాని ఈ రోజు నాలో జరిగే సంఘర్షణకి అంతులేదు.

ఎవర్నీ నేనర్థం చేసుకోలేదు. కాదు ఎవరూ నన్నర్థం చేసుకోలేదు. అర్థం చేసుకున్నా కల్యాణి త్యాగం వ్యర్థమై పోయింది.

అనుభవాలు హృదయానికిగాజు పెంకుల్లా గ్రుచ్చుకున్నయి.

విధి నా జీవితాన్ని నష్టానికి అమ్మేసింది.




నేనిక నిలువలేకపోయాను. ఎక్కడో అనామకుడిన్నిగా జీవితాన్ని చాలించాలి.

భూభారం నామీద పడినంత బరువుగా వుంది.

నా మనస్సుకి ఆలోచించే శక్తిలేక అలసిపోయింది. ఇదో పెద్ద విద్యుద్ఘాతం నాకు.

సుమ కోసరం తెచ్చిన పొట్లం అక్కడే పెటి వెనుదిరిగాను.

"మూర్తీ—"

ఆగాలని లేదు. ఆగక తప్పలేదు.

"ఆగరా నాన్న ఆగు. ఇటు చూడు."

జీవితంలో వాడికి అది పండుగ. అందుకే అంత సంతోషం."

"ఇటు తిరుగవేంరా, ముందు నాథేంక్స్. అందుకో. తరువాత కంగ్రాచ్యులేషన్స్ చెప్పు. చూశావా నా ప్రేమకి ఫలితం. పిచ్చి నాయనా. నీకు ఎంత ఋణపడివున్నానో భగవంతుడికి తెలుసు. నాకుతెలుసు. సుమ కాదుకాదు కస్తూరికి తెలుసు."

"మధూ"

"నమస్కారం డాక్టరుగారు"

సుమలో ఎంత మార్పు. ముఖాన చిరునవ్వు వెదజల్లే బొట్టు. మెడలో మంగళసూత్రం.

"బాగా దణ్ణంపెట్టు, మావాడి ఋణం ఇలా కాదులే తీర్చటం. వచ్చే జన్మలో నేనే వాడి కొడుకై పుట్టి ..."

"మ-ధూ"

"అవునురా. నీలాంటి స్నేహితుడు తప్ప సుమ నెవరు ఆదుకుంటారు. మళ్ళీ వివాహం చేసుకోమని సలహా ఇస్తారు?"

"కాని నువ్వు ... ను.... వ్వు ....క .... స్తూ....రి....ని" మధు విరగబడి నవ్వాడు.

"నువ్వు పప్పులో కాలేశావు. కస్తూరి" సుమ అందుకుంది.

"తరువాత కరుణాకరంగారు నా పేరు సుమ అని మార్చారు."

వాడి దృష్టి పూల పొట్లం మీద పడింది.

"గుడ్, మనివాడికి నామీదెంత అభిమానమో చూడు" అన్నాడు పొట్లం విప్పుతూ.

నా కళ్ళు గిర్రున తిరిగాయి.

మధు వాటిని సుమ తలలోసర్దాడు.

సుమ ఒకసారి వాడి వంక చూసి నాకు వొంగి నమస్కారం చేయబోయింది.

"ఛ! ఛ! ఏమిటిది!"

"ఒరేయ్, బెట్టు చేయక పెద్ద మనిషితనం ఇచ్చినప్పుడు తీసుకో. మనమెలాగూ పెద్ద మనుష్యులం కాలేమనుకో" అని క్షణం ఆగి "ఎలావుంది నా జోక్" అని విరగబడి నవ్వాడు.

"ఆశీర్వదించండి డాక్టరు గారు."

అమె రెండు చేతులు నా పాదాలమీద వున్నయి. నా పాదాలు మండిపోతున్నయి

ఈ స్పర్శని భరించలేను. ఏన్నో కోరికలతో వచ్చిన వాడిన్ని- వట్టి పాత్రగా మిగిలిన జీవితం వెక్కిరిస్తోంది.

"ఏమని దీవించను?"

నా హృదయం ద్రవిస్తున్నది.

"ఏముంది? మగవాళ్ళను అదలించటం కష్టం గాని ఆడవాళ్ళను దీవించటం ఈజీ. పెద్ద సమాసం. నోరుతిరగటంకష్టం కాని."

మధు ఉత్సాహానికి అంతులేకుండావుంది.

"దీర్ఘ సుమంగళిని కావాలని ఆశీర్వదించండి."

"ఆఁ కరెక్ట్. ఇప్పుడు నోటికి వచ్చింది. దీర్ఘ సుమంగళీ భవ. సౌభాగ్యవతీ భవ. ధన, కనక పుత్ర వస్తు వాహన...."

"మధూ!"

మధు నా ముఖంవంక చూశాడు.

"మరో విశేషంరోయ్. సుమంగళిలో సుమ వుంది."

"ఆశీర్వదించండి డాక్టరుగారు. మీ ఆశీస్సుకోసరం ఇన్నాళ్ళు ఎదురు చూశాను సుమంగళిని కావాలని ఆశీర్వదించండి."

"అదే నా ఆకాంక్ష."

అప్రయత్నంగా రెండు అశ్రు పుష్పాలు ఆమె శిరస్సున పడ్డయి.

ఇంతసేపు తట్టుకుని నిలబడ్డాను. కానిఇక శక్తిలేదు.

హృదయంలో ఒక్కసారి తుఫాను చెలరేగింది.

నా రక్తం సముద్రంలా పొంగింది.

నా కళ్ళలో కల్యాణి దీనంగా చూస్తూ కనపడింది.

ఏదో అనుభవం. విషంలా చేదైన అనుభవం! నరనరాల్లో వ్యాపిస్తున్న అశాంతి.

కళ్ళు తిరుగుతున్నయి. కాలం స్తంభించి ద్రవీభూతమై నా దగ్గర దగ్గరగా వచ్చి నన్ను తనలో లీనం చేసుకుంటున్నట్లు అనుభూతి — అంతే, ఈ అనుభూతి యొక్క సమగ్ర స్వరూపము నేను చూడనేలేదు.

*　　*　　*

జీవితంలో మరోసారి ఓడిపోయాను. ఓటమి నా కలవాటైపోయింది. ఇలా తీగలు తెగిన వీణను శృతిచేస్తూ కూర్చోటమే నేమో నా బ్రతుకు?

మధు ప్రేమించింది సుమనేనా? ఈ సత్యం నా కింతకు ముందే తెలిస్తే ఎంత బాగుండేది?

నన్నిప్పుడు డాక్టరుగా ఎవరూ గుర్తుపట్టరు. దేనిమీద మనస్సు నిలవటంలేదు. గది నాలుగు గోడల మధ్యా ఏకాంతవాసం. జీవితమంటే నిర్లక్ష్యం. ఈ విధి చేష్టకి తట్టుకోలేకపోతున్నాను. నా మనస్సుకు హిస్టీరియా వచ్చినట్లైంది.

నాలో ఉత్సాహం చచ్చిపోయింది. నా జీవితం కాగితం పువ్వులా అయింది. నాకు ఇచ్ఛలేదు. నా వ్యక్తిత్వం బీటలు వారిపోయింది. నా కిక మంచి చెడు ఏదీ లేదు. నా జీవితం పొలిమేరలదాకా చాల మంది స్త్రీలు వచ్చి నన్నాకర్షించి నన్నొక ఆటవస్తువుగా తీసుకుని తమ దారిన వెళ్ళిపోయారు. ఈ ఒంటరితనంలో ఏదో వైరాగ్యం. మనస్సు నదుపులో పెట్టుకోవడం చేతకాక. ఆత్మవంచన చేసుకుంటూ బ్రతుకుతున్నాను. కొవ్వొత్తిలా నన్ను నేనే దహింపచేసుకుంటూ అది ఆరిపోయే చివరిక్షణం కోసరం నిరీక్షిస్తూ కూర్చున్నాను. ఇది నా జీవితపు చరమాంకం. మృత్యుదేవత పాదాల సవ్వడి కోసరం నా హృదయంలోని అణువణువు వేయి కళ్ళతో ఎదురు చూస్తున్నాయి.

నాకిక కన్నీరు లేదు, రాదు, నేను దుఃఖం మరిచిపోయాను. ఇక నా లక్ష్యం ఒకటే, నా ధ్యేయం మృత్యుదేవత ఒడిలో హాయిగా నిదురించటం, కాని ఆ ఆలోచన లేకుండా బ్రతుకలేనేమొ?

స్త్రీ నర్థంచేసుకోటం నాకు చేతకాలేదు. అసమగ్రంగా మిగిలిపోయిన పురుషత్వం నన్ను చూసి వెక్కిరించింది, అసంపూర్ణమైన చిత్రంలాంటిది నా జీవితం.

క్రమంగా కొవ్వొత్తి ఆరిపోతుంది.

ఆ ఆరిపోవటంలో అర్పణ. అనంత విశ్వంలో ఆ వెలుగు కలిసిపోయి అంతమైతుంది.

నేను?

ఆ వెలుగు ఆరేలోపున మరో దీపమైనా వెలిగించగలనా?

ఏమో!

*　　*　　*

వెలుగు.

కళ్ళుపోయే వెలుగు.

ఆ తరువాత—

ప్రశాంతి!

పువ్వులు వెదజల్లే చిరునవ్వులాంటి శాంతి.

అర్ధరాత్రి సమాధులలో ఉండే నిశ్శబ్దం లాంటి శాంతి.

శబ్దంకంటే నిశ్శబ్దం శక్తివంతమైనది.

ఆ నిశ్శబ్దంలో "నేను" క్రమంగా లీనమైపోతున్నది.

ఎంతకాలం గడిచిందో కూడ తెలియదు బరువుగా కళ్ళు తెరిచాను. తల బాధ వేయి సమ్మెటలతో కొడుతున్నంత బాధ. దేహమంతా మండుతున్నది.

ఏం జరిగింది?

ఏం జరిగిందో ఆలోచించేశక్తిలేదు. నా చూపులు చుట్టూ కలయ తిరిగినయి.

ఎంత మంది నాచుట్టూ-

"ఇక పరవాలేదు"

డాక్టరు కృష్ణ-డాక్టర్ కామేశం- డాక్టరు శివం- డాక్టరు సునంద....

అక్కడెవరు?

నా మనస్సు తిరిగి స్వాధీనం తప్పింది.

ఆమె ఆత్రంగా నావంక చూసింది.

భగవాన్!

మళ్ళీనా కోపరీక్ష.

కళ్ళు తెరిచాను.

కంటిలోంచి దూసుకుపోయిన చూపులు ఆమెవద్ద కాపురం ఏర్పరుచుకున్నాయి.

ఆమె ముఖం నీటిలో తడిసిన పువ్వులా వుంది.

ఆమె కళ్ళు జేవురించినయి. ఆమె ముఖంలో కళలేదు. కాంతిలేదు. ఆమె చూపులు అన్వేషిస్తున్నయి ఎవరినో?

"రా-ధా!"

రాధ తలెత్తి నా వంక చూసింది. ఎంత ఆపుకున్నా ఆమెకు దుఃఖం ఆగుతున్నట్లు లేదు. రెండు చేతులలో ముఖం దాచుకుని బావురుమంది.

"ఛీ, ఏమిటేది రాధా? ఇలా బాధపడకూడదు అతనికేం ప్రమాదం లేదు. శుభ్రంగా తగ్గిపోతుంది" అన్నాడు పల్స్ చూస్తూ కృష్ణ సునంద రాధని దగ్గరికి తీసుకుంది.

"కృష్ణా, ఏం జరిగింది?"

"యాక్సిడెంట్. నీకు గుర్తు రావటం లేధా?"

"ఉఁ హూఁ ఏమో తెలీడంలేదు."

"తల మీద గాయం తగిలి చాలా రక్తం పోయింది. నిన్నటిదాకా ఆశలేదు మాకు."

"కాని మీరంతా కలసి బ్రతికించారు."

కృష్ణ ముఖంలో సంతృప్తి వెలిగింది. ముఖం మీద స్వేద బిందువుల్ని జేబురుమాలుతో తుడుచుకున్నాడు.

రాధ తెప్పరిల్లింది. నా వంక చూసింది.

"రాధా' నువ్వెలా వచ్చావు?"

"నువ్వే రాధకోసరం కలవరించావు. టెలిగ్రాం ఇస్తే వచ్చింది. వచ్చినప్పట్నించి అదిగో అలాగే కూర్చునివుంది."

"నేను కలవరించానా?"

"మొన్న ఉదయం నీకు మెలకువ వచ్చింది. అప్పుడే రాధని కలవరించావు. కాని నీ బాధ ఎక్కువగా వుందని మార్ఫియా ఇచ్చాము."

నా తల తడుముకున్నాను. తలంతా కట్లు. మనసంతా బరువుగా వుంది.

"యాక్సిడెంట్ ఎలా అయింది?"

"అదే తెలీటంలేదు. బహుశ ఏ కారో, ఏ లారీనో అయి వుంటుంది."

దీర్ఘంగా నిట్టూర్చాను.

"కాని నన్ను బ్రతికించటంలో చాలా పొరపాటు చేసేరేమో?"

కృష్ణ, సునందముఖాలు చూసుకున్నారు.

"నా మానాన్న నన్ను వదిలితే బాగుండేది."

"డాక్టర్లకి విరక్తి కూడదు" అంది సునంద.

"నీకు తెలీదు సునంద. నేను చాలా దురదృష్టవంతుడ్ని. అందుకోలేక, ఎగురలేక నిలబడ్డ అసమర్థుడ్ని. కొన్నాళ్ళక్రితం వరకు నాకు జీవితం మీద విపరీతమైన మమకారం ఉండేది. నా కోసరం ఒక దేవత వస్తుంది. వారికి దాన్ని భద్రంగా అప్పగించాలని- నా జీవితాన్ని బృందావనం చేశాను.. కాని విధి వైపరీత్యంవల్ల వసంత ఋతువు రాకపోవటం వలన ఆకులు రాలి బృందావనం పాడుబడిపోయింది. డాక్టర్-"

రాధ వెక్కి వెక్కి ఏడ్చింది.

నా మాటలు ఆగిపోయాయి ఒక్క క్షణం.

"ఓ, రాధా, సారీ, నిన్ను పలకరించలేదు గదూ? ఏ ముఖం పెట్టుకొని పలకరించను? పోనీలే ఎప్పుడో అప్పుడు నిన్ను చూస్తానని మాట ఇచ్చాను. మాట నిలబెట్టుకున్నాను. అవునా?"

"డెలిరియం కాదుగదా కొంపదీసి?"

శివం చప్పున నాడి చూశాడు.

"డోన్ట్‌వర్రీ శివం. డెలిరియం కాదు. నేనేం మాట్లాడుతున్నానో నాకు బాగా తెలుసు. నాకు తెలియనిదల్లా ఒకటే-"

"మీరు మాట్లాడకుండా పడుకోండి" అంది రాధ.

"అవును టేక్ రెస్ట్. అసలు మాట్లాడకూడదు."

"డాక్టర్లకి డాక్టర్ల సలహా లివ్వక్కర్లేదు."

"ఇప్పుడు మీరు డాక్టరు కాదు. పేషంటు. చెప్పినమాట వినాలి." సునంద అజ్ఞ.



దీపావళి దీపాలవి దీపాలోయ్ దీపాలు

చిత్రం : వి. రామచంద్రరావు, గుంటూరు-1

తప్పదు.

కళ్ళు మూసుకున్నాను. కాని మెల్లిగా చేరిన నిద్ర కనురెప్పల్ని విడదీస్తోంది. నాకు లోపలినుంచి దుఃఖం ఉప్పెనలా విజృంభిస్తోంది.

చీకటి, అజ్ఞానంలాంటి చీకటి నా కళ్ళ ముందు నాట్యం చేసింది.

మరోసారి అర్థంలేని ఆవేదనతో నా హృదయం నిట్టూర్చింది.

* * *

ఇన్నాళ్ళు కర్మని నమ్మలేదు నేను. ఇప్పుడు నమ్మక తప్పటం లేదు.

పది రోజులలో కొంత కోలుకున్నాను.

నా పూర్వపు ఆరోగ్యం రాలేదుగాని, మామూలుగా లేచి తిరగ గలుగుతున్నాను. కాని ఇంకా పదమూడు రోజులవరకు పక్కమీదనుంచి దిగకూడదని కృష్ణ కట్టడి చేశాడు.

మళ్ళీ ఏ కర్మో నన్ను రాధ దగ్గరకు లాక్కు వచ్చింది. నా మూగ వేదనకి ప్రతి రూపంలా వుంది రాధ. సుఖదుఃఖాల సరిహద్దు గీతమీద నడుస్తున్నది రాధ.

కాని ఈ జీవితం విసుగు పుడుతున్నది. నన్ను పక్కమీదనుంచి లేవనీయదు రాధ. ఉదయం లేవగానే బ్రష్, టూత్ పేస్టుతెచ్చి ఇస్తుంది. ముఖం కడుక్కోగానే కాఫీతో సిద్ధమౌతుంది. కాఫీతోపాటె పేపరు ఇచ్చి వెళ్ళిపోతుంది. మరో గంటయినాక స్నానం. ఆతరువాత భోజనం. మళ్ళీ నిద్ర.

సాయంకాలం కూడ ఇదే రిపీట్ అవుతుంది.

నిజంగా రాధకు ఎంతైనా కృతజ్ఞుడ్ని. నాకు రాధచేసిన సేవ ఎవరూ చేయరు. నా రక్తంలోని ప్రతి అణువణువు ఆమెపట్ల కృతజ్ఞతతో నిండిపోయినయి. కాని అలా అని ఆమెవంక సూటిగా చూడలేకపోతున్నాను. ఏదో తప్పుచేసిన వాడిలా అనిపిస్తుంది. కాని రాధ నాతో చనువుగా మాట్లాడుతుంది. ఆమెను కలవరించటం

నాకు ఆశ్చర్యం కలిగించినా రాధకు సంతోషం కలిగించింది.

ఆమె విశ్వాసం ఎక్కువైంది.

జీవితంలో ఇది మరో అధ్యాయం. ఇంత వరకు చదివేసి చెదలు పట్టిన పుటలు క్రమంగా రాధ స్నేహంతో అతుక్కుపోతున్నాయి.

పడుకున్న వాడ్ని విసుగేసి లేచి కూర్చున్నాను. ఉదయమే రాధ పెట్టిన బ్రెడ్ ఇంకా సగం అలాగే వుంది.

"అదేమిటి లేస్తున్నావే! డాక్టరు కృష్ణ నిన్ను కదలకూడదన్నాడు" అంది రాధ.

రాధవంక చూశాను. తడిసిన మల్లెలా వుంది. నాకామెను చూస్తే చాలు ఏవో జ్ఞాపకాలు లీలగాహృదయాన్ని స్పర్శిస్తాయి. కాని ఆమె ఆప్యాయతకి మురిసిపోతాను.

"డాక్టర్లు ఆజ్ఞాపిస్తేసరే. నువ్వుకూడా ఆజ్ఞాపించటమేనా?"

"ఏం? నాకు నిన్ను ఆజ్ఞాపించే అధికారం లేదా?"

వద్దు. మరోసారి ఓడిపోతాను.

"నాకేం తోచటంలేదు."

"పడుకో."

"నిద్ర రాదు."

"పోనీఊరికేకళ్ళుతెరుచుకుపడుకోండి"

"కళ్ళుతెరిస్తే శూన్యమే"

రాధ విసుగ్గా కుర్చీలో కూర్చుంది.

"మరేం చేస్తారు?" అంది.

"ఏదైనా చదువు?"

"ఏముంది పేపరు చదివేశావుగా."

"పోనీ చెస్ తీసుకురా. ఓ ఎత్తువేద్దాం" రాధ మౌనంగా లోపలికి వెళ్ళి చెస్ తెచ్చింది.

ఏమీ తోచక చదరంగం తెమ్మన్నానే గాని ఏమీ ఉత్సాహం లేదు. త్వరలోనే నేను మంత్రిని. ఏనుగుని,శకటాన్నిపోగొట్టుకున్నాను.

"నా జీవితం లాగే వుంది."

"ఏమిటి?"

"నా చదరంగపు ఆట."

రాధ పాన్‌ని ముందుకు తోసి "చెక్" అంది.

నా ఆట కట్టేసింది.

రాధ లేచి వెళ్ళబోయింది.

"తోటలోకి వెళ్ళి కూర్చుంటాను."

"ఎవరికి చెబుతున్నావు? గోడకా? కుర్చీకా? మంచానికా?"

"రోజు ఎవరికి చెబుతున్నాను?"

"ఇహనుంచి 'రాధా ఇది చెయ్యాలి' అంటేగాని చేయను."

"చేయవద్దు."

"అబ్బా, ఇన్నాళ్ళనుంచి ఈ మాట లేదేం?" నవ్వొచ్చింది.

అవును, ఇన్నాళ్ళు నాకు ఈ అమ్మాయి అనవసరమనిపించలేదు. కావాలనిపించింది. నేను డాక్టర్ననే విషయం మరిచిపోయినాను. క్షణంలో నేను రోగినయి నన్ను నేను ఆమెకు అప్పగించివేశాను. కాని నాలో ఏదో భయం, బాధ అసలు నేనొక పిచ్చివాడ్ని.

ఎవరూ ఆలోచించి ప్రేమించరు. ప్రేమించి ఆలోచిస్తారు. అంతా ఒక క్షణంలో జరిగిపోతుంది. ప్రేమావిర్భావంతో మనస్సు ఆనందంతో తేలికైపోతుంది. జీవన గృహానికి సున్నం కొట్టిన కళ వస్తుంది. అది ఒక క్రొత్త జన్మ. అతని ప్రపంచం కొత్తది. జగమంతా అతనిచుట్టూ తిరుగుతుంది. అతని శరీరమంతా అనుభవంతో ఆత్మయిపోతుంది!

"ఏమిటాలోచన? నువ్వు ఆలోచించటం మానెయ్యాలి."

"నిద్రమాత్ర ఇవ్వు."

రాధ క్షణం మాట్లాడలేదు.

నేను తోటలోకి పోయి కూర్చున్నాను.

ఉదయకాంతి హఠాత్తుగా కళ్ళలో జొరబడి తళుక్కుమని మెరిసింది.

బాలసూర్యుని కిరణాలు బంగారు రంగు తీగల చెట్ల సందులగుండా దూసుకు వస్తున్నాయి.

"రాధ కోసరం కావాలని నా హృదయాన్ని కఠినం చేసుకుంటున్నానా?"

జవాబు లేదు.

అంతరాత్మ పరిశీలన చేసుకోగల శక్తి లేదు. కాని ఒకటి మాత్రం నిజమనిపిస్తోంది. ఇన్నేళ్ళ తరువాత రాధ దగ్గరకి రావటం కేవలం కాకతాళీయం కాదు.

ఒంటరిగా కూర్చుని కళ్ళు మూసుకున్నాను.

మౌనం.

మనిషికున్న గొప్ప వరం మౌనం.

ఆ మౌనంలో నా మనస్సు కాలమనే ఎడారిమీద దీనంగా అడుగులు వేస్తూ వెనక్కి నడిచింది.

ఎంత చరిత్ర పరిశీలిస్తే?

దానిలో ఎన్ని విషాదమయమైన అధ్యాయాలు? శాంతి–సుమ– కల్యాణి.

అందరూ విడిచిపెట్టేశారు.

అసలు నాకు కావలసినదేమిటో నాకు తెలియదేమో? ఈ అన్వేషణ అర్థంలేనిది?

ఒక్కసారి యదార్థం జీవితంలో ఎదురై ఊపిరాడకుండా చేసింది.

నన్నెవరూ ప్రేమించలేదు.

కాదు ప్రేమించిన వాళ్ళు దక్కలేదు.

ప్రేమించిన వాళ్ళు దక్కాలని ఏమిటి? కల్యాణి అన్నట్లు ప్రేమకు ప్రతిఫలం ఎందుకు? అవును.

నేను ఇంకా శాంతిని ప్రేమిస్తున్నాను.

శాంతి సుఖం కోరుకుంటున్నాను. లేదా?

లేకుండా ఎలా పోతోంది? శాంతి నా ప్రాణం. నాకామెమీద వాంఛలేదు.

కాని నాకు శాంతి లేదు.

భౌతిక ప్రపంచానికి, అంతరాత్మకి సమన్వయం కుదరటం లేదు.

ఎక్కడుందీ లోపం?

ఏమిటీ నిరీక్షణ?

దూరంగా హృదయంలో ఒక మూలగా ఏదో రవం—

హఠాత్తుగా ఇంత నిశ్శబ్దం కరిగిపోయింది. గడ్డ కట్టిన హృదయంకరగింది. రాధ భగవద్గీత చదువుతున్నది. ఆ స్వరం ప్రకృతి పిలుపులా వినిపిస్తున్నది.

యజ్ఞార్థాత్కర్మణోన్యత్ర యానోయం
కర్మబన్ధనః
తదర్థం కర్మకౌన్తేయ ముక్తసఙ్గస్సమా
చర.

ఇది రాధ సందేశం.

ఈశ్వరుని పిలుపు!

నేను డాక్టర్ని కాని. ఏం చేస్తున్నాను?

బాధ్యతలు బరువులు అన్నీ విస్మరించి కూర్చున్నాను.

కర్తవ్యం మరిచిపోయాను.

యాంత్రికంగా జీవిస్తూన్నాను.

కొన్ని సమస్యలు నాకు విడదీయరానివిగా కనిపించాయి.

కాని అవన్నీ ఈశ్వరుని ఛాయలు. ఆయన ఎన్నో రకరకాలుగా తనని తాను వ్యక్తంచేసుకుంటున్నాడు. కాని నా కాంక్షలే అడ్డువచ్చి ఆయన్ని గుర్తించకుండా చేసింది.

అందుకేనేమో జీవితం శూన్యమైపోయింది. నన్ను నేను ఎవరికీ ఇచ్చేసుకోలేదు కాబట్టి నాకు ఎవరూ దక్కలేదు.

సుఖమంటే ఏమిటి? దుఃఖమంటే ఏమిటి? రెండు భ్రమలే కదా!

ఈ సత్యం గ్రహింపుకు వచ్చినకొద్దీ నాలో తీవ్రమైన ఆవేదన బయలుదేరింది. నా మనస్సు లయత్వంతో ఊగింది.

భారంగా కళ్లుమూసుకున్నాను.

"నిద్రపోతున్నావా?"

కళ్ళు తెరిచాను.

రాధ!

తెల్లటి చీరలో యుగయుగాల తపసు లోంచి లేచి వచ్చినట్లుగా వుంది. సూర్యుడికి ఘలుపలిన ఉషఃకన్య రాధ ముఖంలో దాక్కొంది.

నా హృదయంలో ఉషోదయం జరిగింది.

"పాలు"

"ఇప్పుడు వద్దు."

"రోజు కాగే వాటికి ఇప్పుడేమొచ్చిందీ? ఇదిగో నీకు ఉత్తరంకూడా వచ్చింది."

"ఏదీ?"

"పాలు తాగితేగాని ఇవ్వను" అంది దాచుకుంటూ.

రాధ ఒక మాట అన్నదంటే అది జరిగి తీరాల్సిందే.

గడగడ పాలు తాగాను.

రాధ ఉత్తరం ఇచ్చింది.

ఎగుడు దిగుడుగా ఉన్న అక్షరాలు కల్యాణివి.

"బావా,

నీ సంగతి రాధ వ్రాసింది. మాకు చాలా ఆదుర్దాగా వున్నది. అత్తయ్య ఒకటే గొడవ చేసింది. కాని కులాసాగా వున్నావని తెలిశాక ఆదుర్దా తగ్గింది.

ఇకపోతే, కొంతమందికి జీవితం వదులు చొక్కాలా అవుతుంది. కొంత మందికి బిగుతుగా వుంటుంది. ఎప్పుడైనా ఒకటే. ఊపిరాడదు. అదే విచిత్రం.

బహుశ, నీ అంతట నీవుగా ఈ స్థితికి వచ్చావేమో ఒకసారి ఆలోచించి చూడు. నిక్షేపంలా డాక్టరు చదివావు. కాని దాన్నిలా గాలికి వదిలేశావు. ఏవో సిద్ధాంతాలు పట్టుకుని కూర్చున్నావు. కాని నీకేం లభించింది బావా? అపజయం తప్ప!

నీ జీవితం ఇంత చేదుగా వుండటానికి కారణం నీ ప్రతి అనుభవంలోను విషాదాన్ని స్పర్శించటంవలన కావచ్చు. కాని అది మిధ్య కల. ఎంత అద్భుతమైనా అది సత్యంకాదు. ఎంత ఇష్టమైనా అందనివని తెలిసినప్పుడు అందిన వాటినే ఇష్టంగా మార్చుకోవాలి. తప్పదు. తృప్తి లేకపోతే మనిషి జీవించలేడు. నీ వేదన, బాధ, ఇవన్నీ మరిచిపోయి మళ్ళీ మామూలు ప్రపంచంలో పడాలంటే వివాహం చేసుకోక తప్పదు. నీ అదృష్టం. నిన్నింకా ప్రేమించే వాళ్ళున్నారు. అసలు నిన్ను నువ్వు ప్రేమించటకో ముందు. జీవితం మొత్త

# ముద్దాయి

ఆకాశం ఫెళఫెళా విరుగకముందే
అతడికి దగ్గరగా వుంచండి న్యాయస్థానం
అవనీతలం గిరగిరా తిరుగకముందే
అతణ్ని కౌగలించనివ్వండి శ్రీకృష్ణ జన్మస్థానం.

అధికారి పత్నుల మంగళాక్షితలను శిరస్సుపై ధరించి
అర్జంటుఫైళ్ళ పర్వతాల భారాన్ని భుజాలపై వహించి
ఇల్లు చేరాక సాయంత్రానికల్లా అవన్నీ మరచిపోయి
ఇల్లాలితో వ్యవహారం సాగిస్తున్నవాడు—కాడంటారా ముద్దాయి?

ఆ సరికొత్త ధోరణి చూచి అతడికి పిచ్చెక్కిందేమోననుకొని
వ్యాకులపడే ఆ యిల్లాలికి అతడిచ్చిన లెక్చరు యూపతూ
ఆలకించిన వాళ్ళకే తెలుస్తుంది— ఈ దేశంలో వాక్స్వాతంత్ర్యాన్ని
అందరికీ ఇచ్చి వుండటంవల్ల వచ్చిపడిన విపత్తు.

"నెలనెలా అయిదేసి రూపాయలు బ్యాంకిలో
నిలవచేస్తానికపై నా జీతంలో నుండి.
అదంతా ఒక మొత్తమై ఏడేళ్ళలో
అవుతుంది చిన్న వ్యాపారానికి పెట్టుబడి.
ఆ వ్యాపారంలో వచ్చే మొట్టమొదటి లాభంలో
అమ్మకు చీర కొనిపెట్టొచ్చు.

నాన్నకు ట్రీట్‌మెంట్ ఇప్పించుదాం ఆసుపత్రిలో
నారాయణ చదువుకూడా ఒకదారికి తేవొచ్చు.
ఈలోగా అప్పులు కూడా తీర్చేశామా—
ఇక మనకు దిగులేమున్నదే, భామా?"

అలా అంటూ ఆమె జడలో పూలు సర్దుతూ కూర్చున్నాడంటే
అతడికి కొంచెమైనా వుందంటారా బుద్ధి?
అధికార్లు చెవినికొక్కా ఈ విషయం వేళ్ళ్లేసుకోండి

అతగాడి సంతానం చేసుకున్న అదృష్టంకొద్దీ
ఆఫ్టరాల్, అతడు మామూలు మధ్యతరగతి ప్రాణి
అతడి కన్ని దురాశలుండటం మన సంస్కృతికే హాని.

—పణతుల రామచంద్రయ్య

అర్థం, పరమార్థం తెలుస్తుంది నీకు. జీవితం అంటే అన్వేషణ. నిత్య సత్యాన్వేషణ.

జీవితం యొక్క పరిధి చాలా చిన్నది. కాని అది అమూల్యమైనది. నీ జీవితం నష్టపడిందని కూర్చుంటే మరింత నష్టపడతావు! కాని అది నీతో ఆగదు. నీతోపాటు నీ చుట్టూ వున్న సంఘం నష్టపడుతుంది. కారణం నువ్వు డాక్టరువి కనుక.

చాలమంది వ్యక్తులు ఒక విధమైన అమాయకత్వంతో జీవిస్తారు. వాళ్ళు అదృష్టవంతులు. వారు అతి సులభంగా జీవితంతో రాజీపడతారు. వాళ్ళు ఎప్పుడు జీవితం ఎలా వుందని ఆత్మవిమర్శ చేసుకోరు. వారికి ప్రేమించటం తెలీదు. వారికి ఏ సమస్య ఎదురవదు. అయినా దాన్ని జీవితమే పరిష్కరిస్తుంది. అది యాంత్రిక జీవితమైతే కావచ్చు కాని వాళ్ళు మాత్రం బ్రతకటం లేదా? ప్రేమ గొప్పదే కావచ్చు. కాని జీవితం అంతకన్నా గొప్పది. ప్రేమకి జీవితమే ఆలంబనం కాని నీ అంతట నువ్వే జీవితాన్ని ఊబిలా చేసుకున్నావు.

ఇంకా చెప్పేందుకు ఏంలేదు. అత్తయ్య నిన్ను తలచుకుని కన్నీరు పెట్టని రోజు లేదు. నువ్వు కొడుకుగా ఆవిడకి మిగిల్చేది ఇదేనా? దాన్ని ఆనందబాష్పంగా మార్చు. మనిషి కర్తవ్యాన్ని మరిచిపోకూడదు.

నీ ఆరోగ్యం జాగ్రత్త.

కల్యాణి."

గాలికి రెపరెపలాడింది.

"ఎక్కడ్నించి ఉత్తరం?"

పూలు కోస్తూ వచ్చింది రాధ.

"కల్యాణి వ్రాసింది."

"ఏమిటి?"

"చదువు."

రాధ నావంక చూసి ఉత్తరం తీసుకుంది. చదువుతున్నంతసేపు రాధ ముఖంలో భావాలు చదవాలని ప్రయత్నించాను. అంతా చదివి ఉత్తరం ముందు పడేసిం

"చదివావా?"

"చదివాను."

"ఏమంటావు?"

రాధ మాట్లాడలేదు. మౌనంగా వెళ్ళి మామిడి మొక్కల దగ్గరకు వెళ్ళి ఎండిపోయిన ఆకులు త్రుంచుతూ నిల్చుంది.

"మాట్లాడవేం రాధా?"

"ఏం చెప్పను? జీవితం వెక్కిరించిన వాడివి నువ్వు. మనిషి ధనం పోతే సంపాదించుకుంటాడు. ఆరోగ్యంపోతే ఆరోగ్యవంతుడౌతాడు. కాని చరిత్రహీనుడైతే ఇక అతని ఉనికి ఉండదు."

రాధ ప్రకృతిలో కలిసిపోయి మాట్లాడుతున్నది. రాధేం మాట్లాడుతున్నదో నాకర్థం కాలేదు. కాని ఆ మాటలు నా ఆత్మలో గానం చేస్తున్నట్లుగా అనిపించాయి. ఆమె కదిలితే సృష్టి కదిలింది.

"పోగొట్టుకున్న వాళ్ళు చాలామంది వున్నారు. వారు కూడ నీలా జీవితాన్ని వ్యర్థంచేయడం మొదలుపెడితే— ఈ ప్రపంచంలో సగంమంది కూడా మిగలరు. నీకు ఒక లక్ష్యం ఉండవచ్చు. ఒక ఆదర్శం వుండవచ్చు. కాని దాన్ని అందుకోటానికి మిగిలినవెన్నో త్యాగాలు చేసుకుని, అప్పటికీ అందుకో లేకపోతే కన్నీరే గతి అనుకోటం అవివేకం. అది నీ అజ్ఞానం. ప్రపంచంలో మనుష్యులందరికీ కోరినవన్నీ లభిస్తే దుఃఖమే వుండదు. కాని లభించవు. నేనుకోరింది నాకు లభించిందా?"

కలలో ఉండి మాట్లాడుతున్నది రాధ.

హఠాత్తుగా నా హృదయంలో దీపం వెలిగింది.

రాధ కోరింది రాధకు దక్కలేదు. మరి నాలా జీవితాన్ని వ్యర్థం చేయలేదా!

"చిత్రం ఏమన్నా వేశావా రాధా?"

రాధ నిట్టూర్చింది.

"ఏం?"

"దుఃఖం కొందరిని కవులను చేసింది. నువ్వు చిత్రకారిణివైనావు. ఏం వేయ లేదా?"

రాధ జాలిగా నవ్వింది.

"ఒకటే వేశాను."

"ఇంకేమీ వేయలేదా?"

"ఉహుఁ!"

"ఎందుకని?"

"ఆ వేసిన ఒక్కదాన్ని అలా చూస్తూ కూర్చోటమే నా పని. అదే నా అన్వేషణ. నా తపస్సు. రేయింబవళ్ళు దాని ముందు కూర్చుంటాను. బహుశ ఇంకే చిత్రము వేయలేను. అదే నా చివరిది." అంది వ్యధతో.

"ఇక్కడికి తెచ్చావా? చూపించు." రాధ నా వంక చూసి లోపలికి వెళ్ళి అయిదు నిమిషాలలో తిరిగి వచ్చింది.

"జిలుగు వెన్నెల నాడు బ్రతుకును చిమ్మ చీకటి చేతువా?"

అది చిత్రం.

అందులో రాధని గుర్తించకపోలేను.

సంధ్యా సమయం.

సూర్యుడి ఆఖరి కిరణాలు ప్రకృతిని రాగ రంజితం చేస్తున్నాయి. ఈశ్వరుడుకి, మనిషికి అనుబంధమైన ప్రకృతి రాధ అయింది. ఆమె అర్ధనిమీలిత నేత్రాలతోనిరీక్షిస్తున్నది. ఆమె కళ్ళముందు ఏ అజ్ఞాత పథికుడి రూపమో దృశ్యాదృశ్యంగా కనిపిస్తోంది. ఆమె నివేదనకి గుర్తుగా దోసిట్లో పారిజాతాలు ఎదురు చూస్తున్నాయి.

"బాగుందా?"

"ప్రాణంవుంది."

"కాని చిత్రకారిణిలో ప్రాణంలేదు."

"నీ బాధలో ప్రాణంవుంది. నీ ప్రేమలో ప్రాణంవుంది."

"కాని దాన్నెవరూ గుర్తించరు."

రాధ చెక్కిలిపై కన్నీళ్ళు.

"గుర్తించినా గుర్తించకపోయినా నీ విలువ నీకుంది. దాన్ని నే నెప్పుడు గౌరవిస్తాను."

రాధ మౌనంగా పూరుకుంది.

హృదయపు కవాటాలు మెల్లగా తెరుచుకుంటున్నాయి.

ఎన్నో శేష ప్రశ్నలు నా హృదయంలో కదులుతున్నాయి.

నన్నిలా ఎవరాదరిస్తారు? నా కోసరం ఎవరు బాధ పడతారు? మన బాధను మరొకరు పంచుకుంటే తృప్తి. ఈ తృప్తిని పొందటం ఎంత కష్టమో పోగొట్టుకోటం కూడ అంతకష్టం.

నా హృదయం జడత్వంతో మూగబోయింది. నా చేతులో చిత్రం జారిపోయింది.

మనిషి ఈశ్వరుని తన ఆత్మద్వారా ప్రతిక్షణం స్పర్శిస్తూనేవున్నాడు. కాని ఆ స్పర్శని గుర్తించలేకపోతున్నాడు. ఆ స్పర్శ ఆనందమయమైనది. ఆరోగ్యవంతమైనది.

ఈ స్పర్శలో అన్వేషణ, నిరీక్షణ, ఆవేదన, కన్నీరు, బాధ – వీటి నెదుర్కొనటంలో ఆనందం అన్నీ మిళితమైవున్నాయి. దుఃఖాన్ని పోగొట్టుకోటానికి మనిషిపడే బాధే ఆనందం.

ప్రేమ ఒకటే. ఐక్యంకావాలనేకాంక్షతో రెండు రూపాల విభాగమై తనని తాను వ్యక్తం చేసుకుంటోంది.

రాధ అంతులేని పథము వెంట ఒంటరిగా తంబుర వాయించుకుంటూ పోతున్న తపస్వినిలా వుంది.

నా మనస్సులో క్రొత్త సృష్టి జరుగుతున్నది. సృష్టి రహస్యం పుటలు విప్పుకుంటున్నది.

ప్రేమకి పరమార్థం ఏమిటి?

శారీరక వాంఛ కాదు.

ఒక్కసారిగా నా ఆత్మ జాగృతమైంది.

ఆకాశంలో సూర్యకాంతి రెక్కలు చాచి వ్యాపిస్తున్నది.

నా కళ్ళముందు రాధ నడిచి వెళ్ళిపోతున్నది. ప్రకృతిలో లీనమౌతున్నది.

"రాధా?"

ఆవేదనతో కూడుకున్నది పిలుపు.

రాధ పదాలు ఆగిపోయాయి.

"రాధా, నన్ను ప్రేమిస్తావా?"

రాధ చప్పున వెనక్కి తిరిగి తడి ఆరని కళ్ళతో నన్ను చూసింది.

తీరా నోరు జారాక నా లిక్క రుచుకున్నాను. ఇదెంత తెలివితక్కువ ప్రశ్న?"

రాధ జవాబు చెప్పింది.

"నీ హృదయం గుర్తించగలిగితే జవాబు నీ దగ్గరే వుంది."

"అవును రాధా, నా దగ్గరే వుంది. ఇప్పుడేకాదు. ఎప్పటినుంచో వుంది. కాని నేనే దాన్ని గుర్తించలేదు. కాని నా నిరీక్షణ నీ కోసమే – దారిలో ఎన్ని అడ్డంకులు – వాటన్నిటిని అధిగమించాలంటే ఒక్కొక్కప్పుడు మనిషి జీవితం చాలదు. అయినా నేను తొందరగానే మేలుకున్నాను." ఒక్కసారి నా హృదయం భావమైతన్యంతో పొంగిపోయింది. నూతన సృష్టి పుటలు తెరుచుకుంది. క్రొత్త భావనలతో మనసు సౌందర్యవంతమైంది. ప్రకృతి రసమయమై ఆకర్షిస్తున్నది. నాలో అమృతమయమైన ఆనందం కలిగింది. ఈ ఆనందంతో నాకు శక్తి వచ్చింది. కాని ఈ ఆనందం మృత్యువును మేల్కొలుపుతుందేమోనని భయంగా వుంది.

నాకు తెలుసు. ఈ స్త్రీ నన్ను అసత్యం నుండి సత్య పదానికి, చీకటి నుండి వెలుగుకు, మృత్యువు నుండి అమృతత్వానికి తీసుకుపోతుంది. ఈ ఆరాధనతోనే రాధ నాలో ఐక్యమైంది. అన్ని విధాలా తనని తాను సమర్పించుకుంది. ఇక నేను ఏకాకిని గాను, సుఖములోను, దుఃఖంలోను నాకు తోడునీడై భాగం పంచుకునే స్త్రీ వున్నది.

ఇంతకుముందు ఎన్నో మాట్లాడిన రాధ మూగదై పోయింది. నాకు అంతే. రాధ అలసిన ముఖంలో ప్రసన్నత. ఆ కళ్ళలో అన్వేషణకి నిర్వచనం దొరికిందన్న తృప్తి వెలుగుతున్నది. ఆమె వదనం చైతన్యవంతంగా వుంది.

ఆమెకెందుకో కన్నీరు వచ్చింది.

రాధ నా జుట్టు నిమిరింది. ఆ స్పర్శ ఈ నాటిది కాదు. యుగయుగాల నుంచి పరిచితమైన స్పర్శ.

చప్పున రాధ చేయి పట్టుకున్నాను.

"రాధా?"

"ఊఁ!"

"నాకు బ్రతకటం చేతకాదు."

రాధ అందంగా నవ్వింది.

"ఇన్నాళ్ళ పరిశోధన ఫలితమా?"

"ఏమన్నా అనుకో. జీవితంలో నేను చాలా కోల్పోయాననుకున్నాను. కాని నేను పోగొట్టుకున్నది చాలా స్వల్పమని. పొందిందే ఎక్కువనీ ఇప్పుడనిపిస్తున్నది."

రాధ మెల్లగా అంది.

"నేను నీకోసరం బ్రతుకుతున్నాను. ఇక ముందు కూడ నీకోసరం బ్రతుకుతాను నాకు నువ్వు. నేను భేదం లేదు. నువ్వే నేను. నేనే నువ్వు. ఇన్నాళ్ళు ఈ భావంతోనే జీవించాను. ఇకముందు కూడ జీవించగలను. కాని నువ్వు నన్ను కరుణించావు. అంతే చాలు. ఇంతకన్నా ఇంకేమీకోరను"

అంటూనే నా హృదయం మీద వాలిపోయింది. అగ్ని పర్వతంలాంటి హృదయం ఒక్కసారి ఈ స్పర్శకి బ్రద్దలైంది. అయితే ఆశ్చర్యం! అందులోంచి లావా రాలేదు.

అది అపూర్వానుభవం. జీవితంలో ఇన్నాళ్ళ వేయి వీణలు ఒక్కసారి మ్రోగినయి. వేయి వసంతాలు జొరబడినయి. నా జీవితంలో మరోసారి ఉషస్సు తొంగి చూసింది.

రెండు దుఃఖాల మధ్య స్వల్పకాల వ్యవధి సుఖం. ఆ సుఖం నాకు అనుభవంలోకి వచ్చింది.

"రాధా?"

"ఊఁ!"

"ఏడుస్తున్నావా?"

"నువ్వు-" అంది నా కన్నీరుతుడుస్తూ.

"నేను కన్నీటికి వీడ్కోలు చెబుతున్నాను."

"అవును. ఇంక కన్నీరురాదు. రాదు." జీవితాన్ని నిత్యనూతనత్వం ఆవరించింది. నా జీవిత గృహానికి ఎవరో మామిడి దండలు కట్టారు. నా కళ్ళ తృప్తితో మూతబడినయి. నా హృదయంలో కోయిలలు కూస్తున్నయి. నేను సర్వం మరిచిపోయాను. రాధ లేనిదే ఇక నాకు జీవితం లేదు. ఇదే సత్యం నిండు జాబిల్లిలా నా హృదయంలో ఉదయించింది. నా జీవితమంతా వెన్నెలలు ఆవరించినయి. ★

వార్తలకు, వ్యాఖ్యలకు
"ఆంధ్రజ్యోతి"
దినపత్రికనే చదవండి

